RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

నిజం మా నైజం

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ  సంపుటి : 13  సంచిక : 131  ఆదివారం, సెప్టెంబర్ 07 2025 ,  పేజీలు - 8  వెల : 3/-






# బై.. బై.. గణేషా

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహా గణపతి

### బాహుబలి క్రేన్ పాయింట్ 4 దగ్గర బడా గణపతి నిమజ్జనం

ఖైరతాబాద్ మహా గణనాథుడి నిమజ్జన మహోత్సవం ఘనంగా ముగిసింది.తొమ్మిది రోజులుగా విశేష పూజలందుకున్న బడా గణేషునికి జయ జయధ్వానాలతో ఘనంగా వీడ్కోలు పలికారు భక్తజనులు.

2లో

## ట్రంప్‌కు మోడీ మరో షాక్?

### - ఐక్యరాజ్యసమితి సమావేశాలకు దూరం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 06: అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కావాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశాలకు మోదీ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయనకు బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో ప్రసంగించనున్నట్లు తాజా సమాచారం. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా మిగతా2లో...

## ఆపరేషన్ సిందూర్ మూడ్రోజుల్లో ముగియలేదు

### • ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఆసక్తిక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 06: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టడం, ముగించడంపై ఆర్మీ చీఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్ అందరూ అనుకున్నట్లు- మూడు రోజుల్లోనే ముగిసిపోలేదని, చాలా రోజులు కొనసాగిందని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. దిల్లీలో 'ఆపరేషన్ సిందూర్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఇండియాస్ డీప్ స్ట్రైక్స్ ఇన్‌సైడ్ పాకిస్థాన్' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్క రించారు.ద్వివేది మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పాకిస్థాన్‌తో మే 10న యుద్ధం ముగిసి ందని మీరు అనుకుంటున్నారు. కానీ కాదు. అనేక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండటంతో.. అది చాలా రోజులు కొనసాగింది. ఆ విషయాలన్నీ ఇక్కడ మిగతా2లో...



## కమిషన్ల రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

### కాళేశ్వరంతో కమిషన్లు లాగారు

### రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసారు

### మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు

2లో

## రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించాకే శ్లాబులు

### జీఎస్టీ శ్లాబులపై నిర్మలా సీతారామన్ వివరణ

### ధరలు దిగివచ్చి..సామాన్యులకు మేలుచేస్తుందని వెల్లడి



2లో



## ఫామ్‌హౌజ్‌లో కెసిఆర్ సుదీర్ఘ చర్చలు

### కెటిఆర్, హరీష్ రావులతో మంతనాలు

గజ్వేల్,సెప్టెంబర్6: భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ- అయ్యారు. ఇప్పటికే కేటీఆర్ సహా పలువురు పార్టీ ప్రముఖులు అక్కడ ఉన్నారు. ఇటీవల అసెంబ్లీలో చోటు-చేసుకున్న పరిణామాలు, కాళేశ్వరంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, ఎమ్మెల్సీ పదవికి, భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కవిత రాజీనామా చేయడం తదితర అంశాలపై వీరు చర్చించినట్లు- తెలుస్తోం ది. ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో సుదీర్ఘం గా చర్చలు కొనసాగాయి. మాజీ మంత్రులు కేటీ-ఆర్, హరీష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ- అయిన విషయం తెలిసిందే. మిగతా2లో...

## ఢిల్లీలోని ఎర్రకోటలో దొంగలు

### - కోటి రూపాయల కలశం తస్కరణ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 06: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో దొంగలు పడ్డారు... ఏకంగా కోటి రూపాయలు విలువ చేసే కలశాన్ని ఎత్తుకుపోయారు..! ఈ ఘటన ఈ నెల 2వ తేదీన జరిగిందని పోలీసులు తెలిపారు. ఎర్రకోట పార్కులో నిర్వహించిన జైన మతపరమైన ఆచారం నుండి ఒక అమూల్యమైన కలశం మాయమైంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఈ మత ఆచారానికి వచ్చిన సమయంలో ఈ విషయం వెలుగుచూసింది. ఆయనను స్వాగతిస్తున్న సమయంలో ... కలశం కనబడలేదు. వ్యాపారవేత్త సుధీర్ జైన్ ప్రతిరోజూ పూజ కోసం ఆ కలశాన్ని తీసుకువచ్చే వారని పోలీసులు తెలిపారు. ఢిల్లీ పోలీసుల కథనం మేరకు ... కలశాన్ని దొంగిలించిన నిందితుడి కదలికలు సీసీటీ-వీ ఫుటేజీలో రికార్డయ్యాయి. పోలీసులు నిందితుడిని కూడా గుర్తించారు. త్వరలోనే అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఎర్రకోట సముదాయంలోని జైన సమాజం ఆధ్వర్యంలో కలశ పూజ ఆచారం ఆగస్టు 15 నుండి 9 వరకు కొనసాగుతుంది. ఇదే అదునుగా మిగతా2లో...

## మాతృభాషతో చదువు, ఉద్యోగాల అనుసంధానం

### అప్పుడే ఇంగ్లీష్ వ్యామోహం తగ్గతుంది

### తూమాటి దోణప్ప వర్ధంతి కార్యక్రమంలో వెంకయ్య



విజయవాడ, సెప్టెంబర్ 06: చదువు, ఉద్యోగాలను మాతృభాషతో అనుసంధానం చేసే దిశగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు కదలా లని, అప్పుడే ఇంగ్లీషుపై వ్యామోహం పోతుందని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మిగతా2లో...

## 35లక్షలకు బాలాపూర్ గణేశ్ లడ్డూ



### ఏళకలుగా లడ్డూ కోసం యత్నిస్తున్న దశరథ గౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్6: తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బాలాపూర్ లడ్డూ వేలం పాట ఘనంగా సాగింది. ఈ సారి లడ్డూ వేలంలో భారీ ధర పలికింది. మిగతా2లో...

# బై.. బై.. గణేషా

హైదరాబాద్,సెప్టెంబర్ 06:- హైదరాబాద్ నగరంలో గణేష్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగుతోంది. దారులన్నీ గణపయ్య విగ్రహాలతో హుస్సేన్ సాగర్ వైపు పయనమయ్యాయి. గణపయ్య భక్తులు ఆటపాటలతో శోభాయాత్రాలో పాల్గొంటున్నారు. గణేష్ నిమజ్జనం వేళ నగరమంతా సందడి వాతావరణం నెలకొంది. నగరంలో అత్యంత విశిష్టత కలిగిన ఖైరతాబాద్ మహా గణపతి శోభాయాత్ర ఈ ఉదయం ప్రారంభమైన విషయం తెలిసిందే. వేలాది మంది భక్తులు శోభాయాత్రలో పాల్గొనగా బడా గణేషుడు హుస్సేన్ సాగర్ కు తరలివెళ్లాడు.గణేష్ శోభా యాత్ర కన్నుల పండుగగా జరిగింది. భగభగ మండుతున్న భానుడి ని కూడా లెక్కచేయకుండా బడా గణేష్ శోభాయాత్రలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోలాహలం మధ్య గణనాథుడు ఎన్టీఆర్ మార్గంలోని క్రేన్ నంబర్ 4 వద్దకు చేరుకున్నారు. అన్ వెల్డింగ్ పనుల అనంతరం ఖైరతాబాద్ మహా గణపతి గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. బై బై గణేషా అంటూ భక్తులు వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

# ట్రంప్‌కు మోడీ మరో షాక్?

(మొదటి పేజీ తరువాయి)

యూఎన్ గత నెల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత అమెరికా మాట్లాడుతుంది. సెప్టెంబర్ 23వ తేదీన యూఎన్జీఏ పోడియం నుంచి డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 26వ తేదీన ప్రధాని మోదీ ప్రసంగం ఉంటు-ందని ఆ జాబితాలో ఉంది. అదే రోజున ఇజ్రాయిల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నేతలు కూడా ప్రసంగిస్తారు. ఈ సమావేశాలకు ప్రధాని యూఎస్ వెళ్తారని అంతా భావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్-మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే, అనూహ్యంగా ఈ సమావేశాలకు మోదీ దూరంగా ఉన్నట్లు- తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఆపరేషన్ సిందూర్ మూడ్రోజుల్లో ముగియలేదు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించలేను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాక్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు ఇంకా ఉన్నారని, సరిహద్దు వెంబడి వారి చొరబాటు- ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత్ చేపట్టిన ఆపరేషన్‌లో ఎంత మంది ఉగ్రవాదులు హతమయ్యారో అందరికీ తెలుసన్నారు. ఆపరేషన్ సమయంలో సాయుధ దళాల సహకారాన్ని ఆయన ప్రశంసించారు. ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలను ద్వివేది స్వాగతించారు. డ్రోన్‌లపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం హర్షణీయమన్నారు. భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో పాక్, పీవోకేలోని ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా మెరుపుదాడులు చేసింది. అత్యంత కచ్చితత్వంతో కీలక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య కొన్ని రోజులపాటు- భీకర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అనంతరం పాక్ అభ్యర్థన మేరకు భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. ఈ క్రమంలో ద్వివేది చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఢిల్లీలోని ఎర్రకోటలో దొంగలు

(మొదటి పేజీ తరువాయి)

భావించిన దొంగలు కోట్ల రూపాయల విలువైన కలశాన్ని దొంగిలించారు. ఇందుకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలతో ప్రయత్నాలు ప్రారంభించారు. దొంగిలించిన కలశం చాలా విలువై నదని, దాని విలువ దాదాపు కోటి రూపాయలు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. మొత్తం కలశం బంగారం, వజ్రాలతో పొదిగి ఉందని, ఇది 760 గ్రాముల బంగారంతో తయారు చేసిందని చెబుతున్నారు. కలశంపై 150 గ్రాముల వజ్రాలు, మాణిక్యాలు, పచ్చలు పొదిగి ఉన్నాయని సమాచారం. ఇంత విలువైన కలశం దొంగతనం కలకలం సృష్టించింది. దీనికి ముందు కూడా ఎర్రకోట వద్ద భద్రతా లోపం బయట పడింది. ఆగస్టు 2న, ఎర్రకోట భద్రత కోసం మోహరించిన పోలీసులు బాంబును గుర్తించలేకపోయినప్పుడు ఒక కేసు వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ పోలీసుల కథనం ప్రకారం ... ఆగస్టు 2న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల రిహార్స్‌లో భాగంగా మాక్ డ్రిల్ కోసం స్పెషల్ సెల్ బృందం సాధారణ దుస్తుల్లో వచ్చింది. వారు తమతో పాటు- నకిలీ బాంబును తీసుకుని ఎర్రకోటలోకి ప్రవేశించారు. కానీ ఎర్రకోట భద్రత కోసం మోహరించిన పోలీసులు ఆ బాంబును గుర్తించలేకపోయారు. అప్పుడు నిర్లక్ష్యం కారణంగా పోలీసులను కూడా సస్పెండ్ చేశారు. ఇప్పుడు దొంగతనం సంఘటన వెలుగులోకి వచ్చింది.

# ఫామ్‌హౌజ్‌లో కెసిఆర్ సుదీర్ఘ చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్నట్లు- తెలుస్తోంది. హరీష్ రావుపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై ఆసక్తికర చర్చ జరుగుతున్నట్లు- సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి ప్రభుత్వం అప్పగించిన విషయంపై ఆదివారం కూడా సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. కొద్దిసేపటి క్రితమే.. ఫామ్ హౌస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లినట్లు- సమాచారం. అయితే.. ఫామ్ హౌస్‌లోనే హరీష్ రావు, కేటీఆర్ ఉండనున్నట్లు- తెలుస్తోంది. ఈ మేరకు రేపటి సమావే శాల తరువాత మీడియా సమావేశం లేదా ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. అయితే మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై తాజాగా మాజీ మంత్రి హరీష్ రావు స్పందించిన విషయం తెలిసిందే. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని తెలిపారు. రాష్ట్ర సాధనలో తన నిబద్ధత అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. ప్రజల ఆకాంక్షల మేరకే పనిచేయాల్సిన బాధ్యత తనపై ఉందని నొక్కిచెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో ఓ కార్యకర్తలాగా తాను పాతికేళ్లు పనిచేశానని వ్యాఖ్యానించారు. తనపై, పార్టీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. తనపై దిగజారుడు రాజకీయాలు మంచిది కాదని హరీష్‌రావు హితవు పలికారు. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న సమావేశం ప్రాధాన్యత సంతరిం చుకుంది. అయితే సమావేశాల అనంతరం బీఆర్ఎస్ ఎలాంటి ప్రకటన చేస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

## సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు అస్వస్థత

**- అపోలోకు తరలించి చికిత్స**

హైదరాబాద్,సెప్టెంబర్6: సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో, ఆయనను జూబ్లీహిల్స్ అపోలో ఆసుప్రతికి తరలించారు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు- వైద్యులు వెల్లడించారు. శ్రీశైలం దర్శనం కోసం వెళ్లిన ఆయన శనివారం ఉదయం హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది.. ఆయన్ను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

# రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించాకే శ్లాబులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 06:- జిఎస్‌టి శ్లాబులు 5, 12,18, 28 శాతంగా ఉండేవి. అయితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా ఈ శ్లాబుల విధానం బిజెపి నిర్ణయం కాదని, రాష్ట్ర ఆర్థిక మంత్రుల సాధికార కమిటీ- తీసుకున్నదని శనివారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నాలుగు శ్లాబుల విధానంపై ప్రతిపక్ష పార్టీలు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆమె శనివారం అన్నారు. నాలుగు శ్లాబుల విధానం కాస్తా.. తాజాగా జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో 5, 18 శాతం శ్లాబులకి తగ్గిస్తూ.. గతంలో ఉన్న 12, 28 శాతం శ్లాబులను తొలగిస్తూ ఈ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ శ్లాబులు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానుం ది. తాజాగా ఈ విషయంపై నిర్మలా సీతారామన్ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'సామాన్యులపై దృష్టిసారించి సంస్కరణలు చేపట్టాము. సామాన్యుడు వినియోగించే వస్తువులపై విధించే పన్నుపై సమీక్షించాము. ఈ సంస్కరణల వల్ల రేట్లు- బాగా తగ్గనున్నాయి' అని ఆమె అన్నారు. ఇకపోతే జీఎస్టీ లో సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాసినట్లు- చెప్పారు. పన్ను రేట్లను సవరించాలనే దానిపై రాష్ట్రాలు అభిప్రాయాలు చెప్పినప్పటికీ.. అవన్నీ సామాన్యుడికి ప్రయోజనం కలిగించేవేనని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రజలకు ఎంతో దోహదపడతాయన్నారు. జీఎస్టీ రేట్లలో మార్పునకు మద్దతు తెలియ జేసినందుకు ప్రతి ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు తెలియజేశా. ఎన్ని తీవ్రమైన చర్చలు, వాదనలైనా చేయవచ్చు. చివరకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలతో దేశ ప్రజలకు ఉపశమనం కలిగింది. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ లేఖ రాశానని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే సవరణలే ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా మాట్లాడే అవకాశమే లేదన్నారు. దేశ ప్రయోజనాల కోసం అందరూ ఒక్కతాటిపైకి రావడం సంతోషకర విషయమన్నారు.రేట్ల తగ్గింపుపై రాష్ట్రాలు ఎప్పుడూ అనుకూలంగానే ఉంటాయని, అయితే, వారి ఆందోళనంతా రాబడిలో కోతపైనే ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తాజా తగ్గింపుతో రాష్ట్రాలకే కాకుండా కేంద్రం కూడా ఆదాయం కోల్పోతుందన్న విషయం వారికి చెప్పాను. రేట్లు- తగ్గితే ప్రజలు కొనుగోలు చేస్తారు. తద్వారా కోల్పోయిన ఆదాయాన్ని ప్రభుత్వాలు భర్తీ చేసుకోవచ్చు.ఏకాభిప్రాయం కుదిరిందని కేంద్ర మంత్రి వివరించారు. ఇదిలాఉంటే, ఇటీవల తీసుకున్న జీఎస్టీ- కొత్త రేట్లు- సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న విషయం తెలిసిందే.

# మాతృభాషతోచదువు, ఉద్యోగాల అనుసంధానం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. తద్వారా మన మాతృభాషను పరిరక్షించు కుని, ముందుతరాలకు సగర్వంగా అందించడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆచార్య తూమాటి దొణప్ప 30వ వర్ధంతి సందర్భంగా విజయ వాడలోని పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం' పుస్తకాన్ని వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. పుస్తక రూపకర్తలైన చెన్నపురి తెలుగు అకాడమీ సభ్యులు తూమాటి సంజీవరావు, తిరునగరి భాస్కర్‌తో పాటు- పుస్తకం లోని వ్యాసాలు అందించిన రచయితలకు అభినం దనలు తెలిపారు. మన జీవన విధానంలో మాతృభాష ఆయువుపట్టు- అని.. తెలుగు సంప్రదా యాలను పునరుజ్జీవం చేయాలని పిలుపునిచ్చారు. జానపద సాహిత్యం మొదలుకుని, తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి తదితర విభాగాల్లో ఆచార్య దొణప్ప చేసిన కృషి మహోన్నతమైందని... సాహితీ సవ్యసాచిగా, సాహితీ కృషీవలుడిగా పేరు పొందారన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతిగా దొణప్పని నియమించిన సందర్భంలో తాను అప్పటి సీఎం ఎన్టీఆర్‌ను ఓ మంచి నిర్ణయం తీసుకున్నారని అభినం దించానని వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు. ఎంతో మంది మహనీయుల కృషి ఫలితంగా... కేంద్ర ప్రభుత్వం తెలుగుకు ప్రాచీన హోదా ఇచ్చినా, తెలుగు వెలుగులు భావితరాలకు అందకపోవడం విచారకర మని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాచీన తెలుగు హోదా ఫలాలు భవిష్యత్ తరాలకు అందేందుకు తెలుగు వారంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గణేష్ ఉత్సవాల బందోబస్తు ఓ అనుభవం

- ఏ పండగ అయినా తొక్కిసలాట రాకుండా చూస్తాం
- ట్రైనీ ఐపిఎస్ అధికారులతో కమిషనర్ సివి ఆనంద్



హైదరాబద్, సెప్టెంబర్ 06:- గణేష్ ఉత్సవాల బందోబస్తు నిర్వహించడం 13వ సారి అని, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నాలుగో సారి అని సివి ఆనంద్ తెలిపారు. శనివారం నేషనల్ పోలీస్ అకాడమీ నుండి 170 మంది ట్రైనీ ఐపిఎస్ అధికారులతో కమిషనర్ సివి ఆనంద్‌తో ముఖాముఖిగా మాట్లాడారు. సివి ఆనంద్ హైదరాబాద్ నగరంలో 10 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన తన అనుభవాన్ని పంచుకున్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంత సున్నితమైన, విస్తారమైన నగరాల్లో ఒకటని, ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, అందుకే పండుగల నిర్వహణ చాలా ముఖ్యమని వివరించారు. గణేష్ ఉత్సవాలకు పోలీసులు బందోబస్తు ఎలా నిర్వహిస్తారో వివరిస్తూ, ఈ ఏడాది నిమజ్జనం కోసం చివరి రోజున సుమారు 25,000 విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని ఆనంద్ పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో జరిగే ఈ ఉత్సవానికి ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా భద్రత కల్పించడం చాలా ముఖ్యమని చెప్పారు. గణేష్ ఉత్సవం, మిలాద్ ఉన్ నబీ, బోనాలు, దసరా నవరాత్రులు, హనుమాన్ ర్యాలీ, శ్రీ రామనవమి ర్యాలీ వంటి పండుగల సందర్భంగా తొక్కిసలాటలు జరగకుండా హైదరాబాద్ పోలీసులు తీసుకుంటున్న కార్యాచరణ ప్రణాళిక, సన్నాహాలు, వ్యూహాలు మరియు ఇతర చర్యల గురించి ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆన్‌లైన్ అనుమతి ఫారాలు, విగ్రహాలకు జియోట్యాగింగ్, డ్రోన్‌లు, యాప్‌లు, సిసిటివిల వాడకం, అలాగే మల్టీ-ఏజెన్సీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వంటి సాంకేతికతను పోలీసులు ఎలా వినియోగిస్తున్నారో కూడా కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో రామ్ నివాస్ సేపట్, ఐపీఎస్, కల్మేశ్వర్ సింగేన్వార్, ఐపీఎస్ మరియు పుష్ప, డీసీపీ, పాల్గొన్నారు.

## 35లక్షలకు బాలాపూర్

# గణేశ్ లడ్డూ

(మొదటి పేజీ తరువాయి)

దీన్ని కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ అనే వ్యక్తి రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. వేలంలో 38 మంది భక్తులు పాల్గొన్నారు. గతేడాది ఈ లడ్డూను రూ.30.01 లక్షలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గతేడాదికంటే ఈసారి లడ్డూ ధర రూ.4.99 లక్షలు అధికంగా పలికింది. లడ్డూ విజేత దశరథగౌడ్‌ను ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ- సన్మానించింది. 'బాలాపూర్ లడ్డూ అంటే నాకు చాలా ఇష్టం. ఆరేళ్లుగా దీని కోసం ప్రయత్నిస్తున్నా. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ లడ్డూ దక్కింది. ఎంతో సంతోషంగా ఉందని దశరథగౌడ్ పేర్కొన్నారు. బాలాపూర్ గణేశు డి లడ్డూ కోసం ఆరేళ్లుగా ప్రయత్నిస్తున్నాని లడ్డూ విజేత లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ గణేశుడి లడ్డూ దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. బాలాపూర్ గణేశ్ అంటే తనకు చాలా ఇష్టమని, గత కొన్నేండ్ల నుంచి ఇక్కడికి వస్తున్నట్లు- పేర్కొన్నారు. ఇవాళ ఆ భగవంతుడు నాకు లడ్డూను దక్కించాడు.. చాలా సంతోషంగా ఉందని లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. లడ్డూ విజేత దశరథ గౌడ్‌ను ఉత్సవ కమిటీ- సన్మానించింది. రూ. 35 లక్షల నగదును ఉత్సవ కమిటీకి దశరథ గౌడ్ అందించారు. రాష్ట్రంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న బాలాపూర్ గణేశుడి లడ్డూ మరోసారి భారీ ధర పలికింది. గత రికార్డులను బ్రేక్‌చేస్తూ వేలం పాటలో రూ.35 లక్షలకు కర్మాన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇది గతేడాదికంటే రూ. 4.99 లక్షలు అధికం. 2024లో బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితికి చెందిన కొలను శంకర్ రెడ్డి రూ.30.01 లక్షలకు దక్కించుకున్నారు. బాలాపూర్ గణేశుడి ఊరేగింపు తర్వాత గ్రామంలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించారు. ఇందులో మొత్తం 38 మంది పాల్గొన్నారు.

# కమిషన్లు రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

- కాళేశ్వరంతో కమిషన్లు లాగారు
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసారు
- మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు



వనపర్తి,సెప్టెంబర్6: కల్వకుంట్ల కుటుంబం పదేళ్లలో భారీగా అవినీతికి పాల్పడిందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పేదలకు ఇళ్లు కడితే కమిషన్లు రావని కాళేశ్రం కట్టారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో 8 లక్షల 19 వేల కోట్ల రూపాయల అప్పుల భారం ప్రజలపై మోపిందని ఆక్షేపించా రు. శనివారం వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలం మంగం పల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు గృహప్రవేశం చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం నెల నెల వడ్డీలు కడుతూనే.. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెడ్లలా ముందుకు తీసుకుపోతున్నామని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పేదవారిని ఓటు- బ్యాంకుగా మాత్రమే చూశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 7 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని.. పాత రేషన్ కార్డుల్లో 17 లక్షల మంది పేర్లను చేర్చామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంవత్సరానికి రెండువేల డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చి ఉంటే అందరికీ ఇళ్లు వచ్చేవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇళ్లు కడితే కమిషన్లు రావని తెలిసి మాజీ సీఎం కేసీఆర్ ఇళ్లను కట్టలేదని ఎద్దేవా చేశారు.

# చందిప్ప శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో అందెల రవమిది చిత్ర యూనిట్ బృందం ప్రత్యేక పూజలు.



**- ఆలయ ఆవరణలో ఆలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు చేతుల మీదుగా సినిమా పోస్టర్ విడుదల.**



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్**
శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ వారిలో వెలిసిన 11 వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో అందెల రవమిది చిత్ర యూనిట్ బృందం శనివారం స్వామి వారికి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం నాట్య మార్గం ప్రొడక్షన్ బ్యానర్ పై నిర్మాత ఇంద్రాణి దావులూరి శివ భట్టిప్రోలు సమర్పణలో తెరకెక్కుతున్న అందెల రవమిది సినిమా పోస్టర్ ను ఆలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు స్వామి చేతుల మీదుగా విడుదల చేశారు. ఆలయ నిర్వాహకులు చిత్ర యూనిట్ బృందానికి స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, చిత్రపటాన్ని బహుకరించారు. చిత్ర బృందం మాట్లాడుతూ ఈ సినిమా ఈనెల 19న థియేటర్లలో విడుదల కానుందని, అలాగే అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో దసరాకు రాబోతుందని తెలియజేశారు. అయితే పోస్టర్ మాత్రం చాలా ఆసక్తికరంగా ఉంది. చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, రచయిత అమెరికా వాస్తవ్యులు ఐటీ రంగ నిపుణులు వేణు నక్షత్రం 30 సంవత్సరాల నుంచి అక్కడే స్థిరపడ్డారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, డబ్బింగ్ కళాకారిణి రైటర్ వ్యాఖ్యాత కృష్ణవేణి శరగోపం, అర్చకులు ప్రమోద్, కమిటీ సభ్యుడు గోపాల్ ఉన్నారు.

# విద్యార్థుల తరగతి వారి సామర్థ్యాలను మెరుగుపరచాలి.

**-ఎన్.శంకర్,మండల విద్యాధికారి,**





**సంగారెడ్డి జిల్లా** సదాశివపేట మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల మాచిరెడ్డిపల్లి, ప్రాథమిక పాఠశాల కొల్కూర్ లను సందర్శించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.కొల్కూర్ ప్రాథమిక పాఠశాలలో అన్ని తరగతులలో విద్యార్థుల తరగతి సామర్థ్యాలను పరిశీలించడం జరిగిందని, తెలుగు మరియు ఇంగ్లీష్ చదివించి,వ్రాయించడం జరిగిందని ప్రతి తరగతి లో వెనుకబడిన విద్యార్థులపై ద ృష్టి పెట్టాలని సూచించడం జరిగిందన్నారుతదనంతరం మాచిరెడ్డిపల్లి పాఠశాలలో 6 మరియు7 తరగతుల్లో గణిత పరిశీలించడం జరిగిందని, అందరు విద్యార్థులు ఆయా తరగతి వారి గణితం వారి సామర్థ్యాలను చేరుకొనే విధంగా టీచింగ్,లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి ప్రతి విద్యార్థి సామర్థ్యాలను పెంపొందించేందుకు టీచర్స్ క ృషి చేయాలని తెలుపడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్.ఎంలు లింగం,హెప్సిబా,టీచర్స్, ఎంఐఎస్ అక్బర్,సిఆర్పి రాజేశ్వర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# 42 సంవత్సరాలుగా పూజలు అందుకుంటున్న వరసిద్ధి వినాయకుడు.

**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్‌బీ**
శంకర్ పల్లి పట్టణంలోని12 వార్డులో 42 సంవత్సరాలుగా ప్రతి వినాయక చవితికి పండుగకి వరసిద్ధి వినాయకుడు పూజలందుకుంటున్నాడు. 1982 వ సంవత్సరంలో జగదీష్ బాబు వరసిద్ధి వినాయక విగ్రహాన్ని ప్రతి వినాయక చవితి పండుగ నాడు ప్రతిష్టిస్తున్నారు. అప్పటినుండి నేటి వరకు ప్రతి సంవత్సరం అదే స్థలములో వరసిద్ధి వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి 11 రోజులు పూజలు నిర్వహిస్తున్నారు. ఇతనికి తోడు గా బీర్ల సురేష్, రాజేష్ గౌడ్, రామ్ రెడ్డి, బిర్లా సాయి, సాయిరెడ్డి, శ్రావణ చారి, క్రాంతి రెడ్డి, టి. శ్రీనివాస్, శ్రీకర్, శ్రీకాంత్, శ్రీనివాస్, నాని ప్రతి సంవత్సరం సహకరిస్తున్నారు. ఎంతో ఉత్సాహంగా వీరందరూ ఒకచోట చేరి ప్రతి సంవత్సరం వరసిద్ధి వినాయక విగ్రహాన్ని వినాయక చవితి పండుగ నాడు ప్రతిష్టించడం సంప్రదాయంగా వస్తున్నది. ఈ సంవత్సరం కూడా భారీ వరసిద్ధి వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించారు. నిమజ్జనం వరకు పండుగ నాటి నుండి ప్రతిరోజు ప్రత్యేక పూజలు చేస్తూ వచ్చారు. కాగా శనివారం వరసిద్ధి వినాయక నిమజ్జనం అంగరంగ వైభవంగా నిర్వహించారు.



# నిమజ్జనం సందర్భంగా భక్తులకు తగు ఏర్పాట్లు కల్పించాలి

**- రాంపల్లి చెరువును సందర్శించిన మాజీ చైర్మన్ చంద్రారెడ్డి**





**కీసర మండల వాస్తవ తెలంగాణ న్యూస్/**మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ గణేశుని నిమజ్జనం సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చెరువుని సందర్శించి , నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి మరియు మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, ఎం శ్రీనివాస్ రెడ్డి, పాల్గొని భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించి, నిమజ్జన కార్యక్రమం నిర్వహించలని మున్సిపల్ సిబ్బందినీ కోరారు.

# భక్తిశ్రద్ధలతో భవాని సేవాలాల్ దీక్షలు

**చౌటకూర్ //06 వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్**

విజయదశమి లలిత్ పంచమిని పురస్కరించుకొని గిరిజనులు చేపట్టే భవానీమాత సేవాలాల్ మహారాజ్ 21 రోజుల దీక్షలను శనివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని విటల్ నాయక్ తండాలో భవానీ సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద ఆలిండియా బంజారా లంబాడ శక్తిపీట్ జాతీయ సహాయ కార్యదర్శి రాథోడ్ విటల్ మహారాజ్ ఆధ్వర్యంలో గిరిజనులు దీక్ష మాలను స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, నియమనిష్టలతో దీక్షలను కొనసాగించాలని సూచించారు. దీక్ష పొందడం ద్వారా ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత గిరిజనుల్లో చైతన్యాన్ని నింపుతుందన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం బాల బ్రహ్మచారి జగద్గురు సంత్ తపస్వీ రామ్ రావ్ మహారాజ్ కృషితోనే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆర్.వీ.గోవర్ధన్ నాయక్, గిరిజన నాయకులు మంజానాయక్. ఇస్రానాయక్, జగదీష్, ఆలయ పూజారులు, ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ తండాల దీక్ష పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా వినాయకుని నిమజ్జన వేడుకలు

**- ఓ బోజ్జ గణపయ్య చల్లంగా చూడవయ్యా**





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్**సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జ నోత్సవం డప్పు వాయిద్యాలు కోలాటాలు మహిళా దాండియా ఆటలతో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జ నోత్సవం భక్తులు జరుపుకున్నారు ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో గత కొన్ని సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం విగ్రహాన్ని వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టాపించి నిత్యం భజన కార్యక్రమాలు 11 రోజులపాటు ప్రతి నిత్యంపూజలు నిర్వహించి విఘ్నేశ్వరుని ఆరాధిస్తారని అన్నారు ఆ ఆది దేవుని విఘ్నేశ్వరుని అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని చల్లంగా చూడాలని కోరుకుంటున్నామని అన్నారు

# ఉత్తమ ఉపాధ్యాయుడుగా మోహన్ రెడ్డి

**- సత్కరించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య**

**చౌటకుర్ //06 వాస్తవ తెలంగాణ న్యూస్ కృష్ణ కాంత్ ప్రతినిధి**
మారుమూల ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి విశేష సేవలందించిన చౌటకూర్ మండలం ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన సి.మోహన్ రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేం ద్రమైన సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ సి.అం జిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వెంకటేశ్వర్లు శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. 1989లో ఉ పాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన మోహన్ రెడ్డి మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నాగులపల్లి, ఆవంచ ప్రాథమిక పాఠశాలల్లో సేవలందించారు. ఆవంచ, తునికితో పాటు పుల్కల్ మండలంల ఎస్.ఇటిక్యాల పాఠశాలలను అప్ గ్రేడ్ చేయించడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. తాను పనిచేస్తున్న పాఠశాలకు ఏదో ఒక గుర్తింపు తీసుకువచ్చేందుకు పట్టుదలగా పనిచేస్తారు. పుల్కల్ మండలం ఎస్.ఇటిక్యాలలో పనిచేస్తూ 2018లో మండల కేంద్రమైన చౌటకూర్ జిల్లా పరిషతు ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. గతంలో ఆరేళ్ల పాటు మండల రిసోర్స్ పర్సన్ గా కూడా విధులు నిర్వహించారు. విద్యార్థుల సంక్షేమం, వినూత్న బోధన, సమాజ సేవలో చూపిన అంకితభావానికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై ఆవార్డును అందుకున్నారు. మరో ఏడాదిన్నరలో పదవీ విరమణ చేయనున్న తనను జిల్లా ఉత్తమ



ఉపాధ్యాయుడుగా ఎంపిక చేసి సత్కరించడం పట్ల మోహన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

# చర్లపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం యాదగిరి జన్మదిన వేడుకలు.



**కప్రా మండల వాస్తవ తెలంగాణ న్యూస్,/**మేడ్చెల్ జిల్లా చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పోరేటర్ గడ్డం యాదగిరి అన్న జన్మదిన శుభాకాంక్షలు తెలుపడం జరిగింది.ఈ కార్యక్రమానికి కాప్రా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొబ్బరినూరి నాగ శేషు, మల్కాజ్గిరి మేడ్చల్ అగ్రికల్చర్ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, మాజీ ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొబ్బరినూరి నాగరాజు, పి మల్లారెడ్డి, బాబురావు, సంతోష్ చారి, కాప్రా డివిజన్ కాంగ్రెస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

# క్రెజీ బాయ్స్ వినాయక నవరాత్రులకి 25 సంవత్సరాలు :

### - గణపతి హెూమంలో నత్తి మల్లేష్ దంపతులు...





**మనోహరబాద్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్ :** మనోహరాబాద్ మండలం కాళ్లకల్ లో ఏర్పాటు చేసిన క్రెజీ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వినాయక నవరాత్రులు ఈ సంవత్సరం ఎంతో ప్రాముఖ్యత చోటుచేసుకుంది. ఈ సంవత్సరం నవరాత్రులు 25 వ సంవత్సరాలు పూర్తిచేసుకున్నాయి. ఇందులో భాగంగా గణపతి హెూమం నిర్వహించారు. రాష్ట్ర సర్పంచ్ ల ఫోరమ్ మాజీ ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ దంపతులు ప్రత్యేక గణపతి హెూమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. క్రీజి బాయ్స్ నవరాత్రులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఆనందం కలిగిస్తుంది అని నత్తి మల్లేష్ అన్నారు. రానున్న రోజులలో గణేష్ నవరాత్రులు మరింత కొత్త శోభ సంతరించుకుంటాయని ఆశిస్తున్నట్లు తెలిపారు

## శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ నగర్ కాలనీలో అంగరంగ వైభవంగా విఘ్నేశ్వరుని నిమర్జనోత్సవం





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్**సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జ నోత్సవం డప్పు వాయిద్యాలు కోలాటాలు మహిళా దాండియా ఆటలతో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జ నోత్సవం భక్తులు జరుపుకున్నారు ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో గత కొన్ని సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం విగ్రహాన్ని వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టాపించి నిత్యం భజన కార్యక్రమాలు 11 రోజులపాటు పూజలు నిర్వహించి విఘ్నేశ్వరుని ఆరాధిస్తారని అన్నారు ఆ ఆది దేవుని విఘ్నేశ్వరుని అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని చల్లంగా చూడాలని కోరుకుంటున్నామని కాలనీవాసులు భక్తులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరికి గణేశుడి ఆశీస్సులు ఉండాలి

### - మోకిలా మాజీ ఎంపీటీసీ యాదయ్య.



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్**ప్రతి ఒక్కరికి గణేష్ ఆశీస్సులు ఉండాలని శంకర్ పల్లి మండలం మోకిలా గ్రామ మాజీ ఎంపీటీసీ యాదయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం మోకిలా గ్రామంలోని భవాని మాత దేవాలయం వద్ద ప్రతిష్టించిన వినాయకుడి ఊరేగింపుకు ముందు లడ్డు వేలం పాట నిర్వహించారు. కాగా ఆ గ్రామానికి చెందిన మైలారం వెంకటేష్ లడ్డు వేలంపాట పాడి రూ.1,50,000 దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బి. యాదయ్య, ఎం. శ్రీకాంత్, జి.రాజు, ఎం. దశరథ్,ఎం. ధనుంజయ, జి. లింగం తదితరులు పాల్గొన్నారు

## మండల ప్రాదేశిక, జిల్లా ప్రాదేశిక పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటర్ జాబితా వివరాలు జిపి ల వద్ద ఏర్పాటు..

### - మండల ఇన్చార్జ్ ఎంపీడీవో గోపాలకృష్ణ.




**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్**శంకర్ పల్లి మండలంలోని ఆయా గ్రామాలలో మండల ప్రాదేశిక, జిల్లా ప్రాదేశిక పోలింగ్ కేంద్రాల వివరాలను ఆయా గ్రామపంచాయతీ ల వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని శంకర్ పల్లి ఇంచార్జ్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గోపాలకృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరితో మాట్లాడుతూ మండలంలోని 11 మండల ప్రాదేశిక స్థానాలు ఉన్నాయని వాటికి సంబంధించిన వివరాలను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వ తేదీ లోపు తెలియచేయాలని కోరారు. ఈనెల 8వ తేదీన సోమవారం మధ్యాహ్నం 12:30 మండలంలోని ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు

# శంకర్‌పల్లి విఠలేశ్వరాలయంలో మట్టి గణపతికి పూజలు చేసిన ముగ్గురు ఎస్ఐలు.



**శంకర్పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్జీ** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపాన గల శ్రీ విఠలేశ్వర ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన మట్టి గణపతికి ముగ్గురు ఎస్సైలు దేవేందర్, సురేష్, బీరప్పలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రాజేశ్వర్ జోషి వారిని స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ప్రముఖ వ్యాపారవేత్త దారం ప్రభు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దారం వెంకటేష్, దారం శ్రీనివాస్, దారం రాఘవేందర్ , తదితరులు ఉన్నారు

## తార అధ్యాపకురానికి జాతీయ పురస్కార




**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్**సంగారెడ్డి జిల్లా సదాశివపేటతారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డికి చెందిన అధ్యాపకురాలు డాక్టర్ ఎస్ విజయకు సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపినారు. తమ కళాశాలలో అధ్యాపకురాలిగా బోధనలో నూతన పద్ధతులను అనుసరించినందుకు అదేవిధంగా 25 సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్నందుకుగాను ఎస్ఐ ఆర సంయుక్తంగా సర్వేపల్లి రాధాకృష్ణ మెమోరియల్ జాతీయ అవార్డును అందించడం జరిగిందని తెలిపినారు. ఈ అవార్డును సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా దేశంలో నిర్వహించే గురుపూజోత్సవము నాడు దేశ జాతీయ రాజధాని న్యూఢిల్లీలో ఢిల్లీ విధానసభ డిప్యూటీ స్పీకర్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకోవడం జరిగిందని ప్రిన్సిపల్ తెలిపినారు. తమ కళాశాల అధ్యాపకురాలికి జాతీయస్థాయి గుర్తింపు రావడం, జాతీయస్థాయిలో రాష్ట్రం నుంచి ప్రాధాన్యత వహించి అవార్డును స్వీకరించడం కళాశాలకే గర్వకారణమని అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ఆత్మకూర్ పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వాస్థ్ కార్యక్రమం

### -ఎన్.శంకర్,మండల విద్యాధికారి,



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్**సంగారెడ్డి జిల్లాసదాశివపేట మండలంలో మొబైల్ హెల్త్ బృందం రక్తహీనత ముక్తి తెలంగాణ కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున ఆత్మకూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షను నిర్వహించారని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ విద్యార్థికి తీవ్రమైన రక్తహీనత ఉండకుండా,అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలను నిర్వహించడం జరుగుతున్నదని,కొంతమంది పిల్లలు మితమైన మరియు తేలికపాటి రక్తహీనతతో బాధపడుతున్నారని,తినే ఆహారంలో పోషకాలు మరియు ఇనుము ఉండాలని,పరిశీలనలో విటమిన్ 'సి' యొక్క ప్రాముఖ్యత విద్యార్థులందరికీ సూచించారన్నారు. చాయ్ తేనీరు అలవాటు వల్ల రక్తంలో ఇనుము లోపం వస్తుందని తెలిపారు, విద్యార్థులకు సాధారణ మరియు ఆరోగ్య చిట్కాలు ఇవ్వడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ హెచ్.ఎం సందీప్ కుమార్, అక్బర్,డాక్టర్ గౌరీశంకర్ గౌడ్, ఏఎన్ఎం బి వరలక్ష్మి ,టీచర్స్, సిఆర్పి రాజేశ్వర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.

## సంగమేశ్వర దేవాలయ విఘ్నేశ్వర మండప అర్చకులు మోహన్ రావు పంతులు గారిని ఘనంగా సన్మానించిన- న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్.

### - సంస్కృతి పరమైన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకం
### - కాంగ్రెస్ పార్టీ ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు గౌడ్.



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో, శ్రీ సంగమేశ్వర దేవాలయ విఘ్నేశ్వర మండపంలో ప్రతినిత్యం పూజలు నిర్వహిస్తున్న మోహన్ రావు పంతులు గారికి శాలువాతో న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ ఘనంగా సన్మానించారు. ఇట్టి తరుణంలో న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడికి తొమ్మిది రోజుల నుండి ఘనంగా భక్తి భజనలతో, ధూప దాప నైవేద్యాలతో, అలంకరణతో, క్రమశిక్షణతో సంస్కృతి బద్ధమైన కార్యక్రమాలు నిర్వహించిన శ్రీ సంగమేశ్వర మందిరం ఆలయ కమిటీ వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా ఆ గణనాథుని యొక్క ఆశీస్సులు అందరిపై ఉంటూ దిన దిన అభివృద్ధి పథంలో ఉండాలని కోరుకుంటూ ఆయురారోగ్యాలు ఆ గణనాథుడు ప్రసాదించాలని వేడుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు పాల్గొన్నారు.

# మహా నగరంలో మామూలు ఆడపిల్ల




జూన్ ఆఖరున మా పదో తరగతి పరీక్షల ఫలితాలొచ్చాయి. నేను ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అవడమే కాక, మా క్లాస్‌మేట్ లక్ష్మణ్, నేనూ స్కూల్ టాపర్స్‌గా వచ్చాం. మండల్‌లో కూడా మేమే టాపర్స్ అని మా సార్లు అన్నట్లు గుర్తు. నన్ను ఎక్కడ వుంచి చదివించాలా అని అమ్మానాన్నలకు దిగులు పట్టుకుంది. అప్పటికి మా నాయనమ్మ, తాతయ్య తాలూకూ మనవరాళ్లలో ఎవరూ టెన్త్ దాటలేదు. మా అక్కే మొదట ఇంటర్‌లో చేరిన ఆడపిల్ల. అందుకోసం మా అమ్మ అత్తగారింటి వాళ్ల నుంచి ఎన్నో మాటలు ఎదుర్కొంది. 'ఏందమ్మా! ఆడిపిల్లలను చదివిచ్చుడు ఎందుకు? పెండ్లి జెయ్యక! ఎన్ని పైసలు గావాలె చదివిస్తె?! దాని ఒంతుకు పెండ్లి జేస్తె కాదా?! అయినా చదువుకుంటె ఇగ చేతుల ఉంటరా? మన మాట ఇంటరా?!' అని ఒకరూ, 'ఇవాళ రేపు కాలేజీకి పోంగనె ప్రేమలు, గీమలు అని అంటున్నరు, అందుకనె నేను నా బిడ్డను చదువు బంద్ జేసి ఇంట్లనే ఉంచినదానికి అన్ని పనులు వొచ్చు. ఒంట జేస్తది, ఇల్లు సదురుతది, నేను ఊరికి పోతె ఇల్లంత దానికే అప్పజెప్పి పోత!' అని ఒకరూ, 'ఇగ కాలేజీల జేరితె ఎక్కడ లేని షోకులు మొదలైతయి. ఎన్ని పైసలు వాటికే చాలవు. మొగోండ్లల్లకు పొయ్యి చదువుకుంటె ఇగ ఆగుతరా?! మొగని మాట ఇంటరా?! అయినా చదివిచ్చి పెద్ద ఉద్యోగాలు జేయిచ్చి బాగా పైసలు సంపాయిస్తె కూడబెట్టాల్నని వాండ్ల అమ్మకు ఆశ. గందుకే చదివిచ్చాల్నని అనుకుంటుంది' అని ఒకరూ%ా% ఇలా రకరకాల మాటలు అమ్మ ముందే కొన్ని, వెనకాల మరి కొన్ని మాట్లాడారు. నాన్న ముందు ఇలాంటివి అనేవారు కాదు. అయినా నాన్న దగ్గర ఆడవాళ్లు మాట్లాడే అవకాశం ఉండేది కాదు, వున్నా భయపడేవారు. మగవాళ్లలో ఇలాంటి మాటలు తక్కువ. అప్పటికే మా ఆర్థిక పరిస్థితులు కొంచెం దిగజారడం మొదలయింది. హాస్టల్‌లో ఉంచి చదివించాలంటే బోలెడు డబ్బులు కావాలి. పైగా బంధువుల మాటలు పడలేక అక్కను మా చిన్నాయన కూతురు లక్ష్మి అక్కయ్య దగ్గర ఉంచారు. ఆమె భర్త హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ పీజీ సెంటర్‌లో లెక్చరర్‌గా పనిచేసేవాడు. అప్పటికి కాకతీయ యూనివర్సిటీ ఏర్పడలేదు. ఆర్ట్స్ కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్‌గా పనిచేసేది. హనుమకొండ సుబేదారిలో ఉన్న క్వార్టర్స్‌లో వాళ్లు ఉండేవాళ్లు. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో వడ్డేపల్లిలో ఉన్న పింగళి మహిళా కళాశాలలో 1974లో అక్కను ఇంటర్‌లో చేర్పించారు. ఆ కాలేజీకి స్పెషల్ బస్సులు ఉండేవి. వాటిలోనే అక్క వెళ్లి వస్తుండేది అక్కను అలా ఉంచినందుకు అమ్మానాన్న లచ్చక్కకు నెలకు ముప్పయ్ రూపాయలు, పదిహేను కిలోల బియ్యం ఇచ్చేవారు. ఇంకా పండిన పప్పు ధాన్యాలూ, కాసిన కూరగాయలూ, వండిన పిండివంటలూ పంపిస్తూ ఉండేవారు. ఒక్కోసారి ఎద్దుల బండి మీద వంటకోసం కట్టెలు పంపించేవారు. లచ్చక్క మా ఇంటి ఆడపిల్లే గనుక తన దగ్గర ఊరికెనె ఏమీ తీసుకోవద్దని వాళ్ల ఉద్దేశం. అక్క అక్కడ అలా సెటిల్ అయిన ఏడాదికి నా సమస్య వచ్చింది.

ఇక హనుమకొండలో దగ్గరివాళ్లెవరూ లేరు. ఆ సమయంలోనే మేము హైదరాబాదులో చిన్నాయన (అమ్మకు మేనమామ కొడుకు) పెళ్లికి వెళ్లాం. పెళ్లి అయిన నాలుగు రోజులకు అందరూ కూర్చుని మాట్లాడుకుంటుండగా నా చదువు ప్రసక్తి వచ్చింది. అప్పుడు నాయనమ్మ..అంటే అమ్మకు మేనమామ భార్య, పేరు మోహినీదేవి, 'ఆ పిల్ల గంత మంచిగ చదివి ఫస్ట్ క్లాసుల పాసయింది. మంచిగ చదివిచ్చవలసిందే! ఎందుకు ఆలోచిస్తవు? ఇక్కడ కాలేజీల షరీకు చెయ్యి. మనింటి పక్కనే మంచి కాలేజీ ఉన్నది. ఇక్కడుండి పోయొస్తది' అన్నది. అమ్మ వెంటనే 'దూరం గదా, ఎప్పుడు కావాల్నంటే అప్పుడు చూడరాదు. హైదరాబాదు అంటే బోలెడు పైసలు ఖర్చు. అయినా, మీకు కూడా పిల్లను ఉంచుకున్నందుకు ఏమన్న ఇయ్యాలె. మా వారితో కూడా ఒక మాట చెప్పాలె' అన్నది. నన్ను వదిలి ఉండాలంటే అమ్మకు కూడా ఎంత దిగులో నాకు అప్పుడు తెలిసింది. అక్కడే ఉన్న శేషగిరిరావు చిన్నాన్న (పెళ్లి కొడుకు) వెంటనే 'నువ్వు మా ఇంటి ఆడబిడ్డవుఒంట జేస్తది, ఇల్లు సదురుతది, నేను ఊరికి పోతె ఇల్లంత దానికే అప్పజెప్పి పోత!' అని ఒకరూ, 'ఇగ కాలేజీల జేరితె ఎక్కడ లేని షోకులు మొదలైతయి. ఎన్ని పైసలు వాటికే చాలవు. మొగోండ్లల్లకు పొయ్యి చదువుకుంటె ఇగ ఆగుతరా?! మొగని మాట ఇంటరా?! అయినా చదివిచ్చి పెద్ద ఉద్యోగాలు జేయిచ్చి బాగా పైసలు సంపాయిస్తె కూడబెట్టాల్నని వాండ్ల అమ్మకు ఆశ. గందుకే చదివిచ్చాల్నని అనుకుంటుంది' అని ఒకరూ%ా% ఇలా రకరకాల మాటలు అమ్మ ముందే కొన్ని, వెనకాల మరి కొన్ని మాట్లాడారు. నాన్న ముందు ఇలాంటివి అనేవారు కాదు. అయినా నాన్న దగ్గర ఆడవాళ్లు మాట్లాడే అవకాశం ఉండేది కాదు, వున్నా భయపడేవారు. మగవాళ్లలో ఇలాంటి మాటలు తక్కువ. అప్పటికే మా ఆర్థిక పరిస్థితులు కొంచెం దిగజారడం మొదలయింది. హాస్టల్‌లో ఉంచి చదివించాలంటే బోలెడు డబ్బులు కావాలి. పైగా బంధువుల మాటలు పడలేక అక్కను మా చిన్నాయన కూతురు లక్ష్మి అక్కయ్య దగ్గర ఉంచారు. ఆమె భర్త హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ పీజీ సెంటర్‌లో లెక్చరర్‌గా పనిచేసేవాడు. అప్పటికి కాకతీయ యూనివర్సిటీ ఏర్పడలేదు. ఆర్ట్స్ కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్‌గా పనిచేసేది. హనుమకొండ సుబేదారిలో ఉన్న క్వార్టర్స్‌లో వాళ్లు ఉండేవాళ్లు. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో వడ్డేపల్లిలో , నువ్వు ఏమిచ్చి పెరిగినవు? అట్లనే అది కూడా! దాని కోసం నువ్వు పైసలు ఇయ్యాల్నా? ఒద్దు' అన్నాడు. నాయనమ్మ కూడా 'అవునమ్మా, గా పిల్ల తినే గింతంత తిండి కోసం మాకు నువ్వు ఇచ్చుడేంది? ఇస్తే మాత్రం మేము తీసుకుంటమా?' అన్నది. అమ్మ ఇక ఏమీ మాట్లాడలేదు. ఆ మర్నాడే నన్ను గోపమ్మ చిన్నమ్మ ( నాయనమ్మ పెద్ద కొడుకు రంగారావు చిన్నాయన భార్యపేరు గోపికా రాణి) రెడ్డి కాలేజీకి తీసుకెళ్లింది. ఆ కాలేజీ చాలా పెద్దది. ఎంతో మంది ఆడపిల్లలు రంగురంగుల బట్టలు వేసుకుని ఆవరణలో తిరుగుతున్నారు. ముందు చక్కగా పెంచిన లాన్, దాని చుట్టూ కత్తిరించిన క్రోటన్ మొక్కలున్నాయి. ఎడం పక్కగా ఓ దారి ఉంది. అక్కడన్నీ బొండుమల్లె చెట్లు, వాటి కింద అమ్మాయిలు కూర్చోవడానికి బెంచీలు ఉన్నాయి. ఇక హనుమకొండలో దగ్గరివాళ్లెవరూ లేరు. ఆ సమయంలోనే మేము హైదరాబాదులో చిన్నాయన (అమ్మకు మేనమామ కొడుకు) పెళ్లికి వెళ్లాం. పెళ్లి అయిన నాలుగు రోజులకు అందరూ కూర్చుని ఒంట జేస్తది, ఇల్లు సదురుతది, నేను ఊరికి పోతె మొదలైతయి. ఎన్ని పైసలు వాటికే చాలవు. మొగోండ్లల్లకు పొయ్యి చదువుకుంటె ఇగ మరి కొన్ని మాట్లాడారు. నాన్న ముందు ఇలాంటివి అనేవారు కాదు. అయినా నాన్న దగ్గర ఆడవాళు మాట్లాడే అవకాశం ఉండేది కాదు, వున్నా భయపడేవారు. మగవాళ్లలో ఇలాంటి మాటలు తక్కువ. అప్పటికే మా ఆర్థిక పరిస్థితులు కొంచెం దిగజారడం మొదలయింది. హాస్టల్‌లో ఉంచి చదివించాలంటే బోలెడు డబ్బులు కావాలి. పైగా బంధువుల మాటలు పడలేక ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ పీజీ సెంటర్‌లో లెక్చరర్‌గా పనిచేసేవాడు. అప్పటికి కాకతీయ యూనివర్సిటీ ఏర్పడలేదు. ఆర్ట్స్ కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్‌గా పనిచేసేది. హనుమకొండ సుబేదారిలో ఉన్న క్వార్టర్స్‌లో వాళ్లు ఉండేవాళ్లు. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో వడ్డేపల్లిలో మాట్లాడుకుంటుండగా నా చదువు ప్రసక్తి వచ్చింది. అప్పుడు నాయనమ్మ..అంటే అమ్మకు మేనమామ భార్య, పేరు మోహినీదేవి, 'ఆ పిల్ల గంత మంచిగ చదివి ఫస్ట్ క్లాసుల పాసయింది. మంచిగ చదివిచ్చవలసిందే! ఎందుకు ఆలోచిస్తవు? ఇక్కడ కాలేజీల షరీకు చెయ్యి. మనింటి పక్కనే మంచి కాలేజీ ఉన్నది. ఇక్కడుండి పోయొస్తది' అన్నది. అమ్మ వెంటనే 'దూరం గదా, ఎప్పుడు కావాల్నంటే అప్పుడు చూడరాదు. హైదరాబాదు అంటే బోలెడు పైసలు ఖర్చు. అయినా, మీకు కూడా పిల్లను ఉంచుకున్నందుకు ఏమన్న ఇయ్యాలె. అలానే వెళితే వారం కిందట చిన్నాన్న పెళ్లి జరిగిన రెడ్డి హాస్టల్ ఉంది. కాలేజీ ఆఫీసులో నా కోసం అప్లికేషన్ తీసుకుంది చిన్నమ్మ. దాన్ని పూర్తిగా నింపి ఫొటోలు, మార్కుల లిస్టుతో పాటు అప్లయ్ చేస్తే సీటు వచ్చాక మిగతా సర్టిఫికెట్లు సబ్మిట్ చేసి ఫీజు కట్టాలట. 'ఈ కాలేజీకి చాలా పేరుంది. ఇక్కడ సీటు రావాల్నంటే కష్టం. కానీ, నీకు వస్తుండొచ్చు, మంచి మార్కులున్నయి, ఫస్ట్ క్లాస్ గద! చూద్దాం' అన్నది చిన్నమ్మ. నాకు ఈ చిన్నమ్మ అంటే చాలా గౌరవం. నైన్త్‌లోనే పెళ్లయితే ఆ తరువాత బీయే దాకా చదువుకుంది. సూర్యాపేటలో వాళ్ల నాన్న యాదగిరిరావు సార్ చదువు చెప్తితే ఎటువంటి మొద్దు పిల్లలయినా పాస్ అవుతారని పేరుండేది. చిన్నమ్మ కూడా చాలా తెలివైనది. మొత్తానికి నాకు రెడ్డి కాలేజీలో సీటు వచ్చిందని వారం రోజుల్లో తెలిసింది. నేను హైదరాబాదులో ఉండటానికి పూర్తిగా రంగం సిద్ధమయింది.

## కవితపై మంత్రి జూపల్లి సంచలన వ్యాఖ్యలు



**జోగులాంబ గద్వాల:** జిల్లా కేంద్రంలో 2 ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి హాజర య్యారు. ఈ నేపథ్యంలో.. మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాజీ ఎమ్మెల్సీ కవితపై సంచలన వ్యాఖ్యలు చేశారు.కవిత మాజీ సీఎం కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని అన్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు గుర్తు చేశారు. కవిత కూడా కొరివి దెయ్యమని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని కవితనే చెప్పారని తెలిపారు. తాను ఆనాడు మంత్రి పదవి కోసం బీఆర్ఎస్ పార్టీలోకి రాలేదని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పాతర వేసిందని విమర్శించారు. కవిత కొంత దాచిపెట్టి.. కొంత మూసిపెట్టి మాట్లాడుతున్నారని జూపల్లి ఆరోపించారు.

## సీఎంఆర్ ఎఫ్ కేసులో ఆరుగురి అరెస్టు



**సూర్యపేట్,:** కోదాడ కేంద్రంగా ముఖ్యమంత్రిసహాయ నిధి చెక్కుల కుంభకోణంలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. లబ్ధిదారుల చెక్కులను నకిలీ పేర్లతో రీవాలీడేట్చేసి డబ్బులు కాజేస్తున్న ఈ ముఠా వద్ద నుంచి నగదుతో పాటు డ్రా చేయని చెక్కులను స్వాధీనం చేసుకున్నారు.ఈ కుంభకోణానికి పాల్పడుతున్న ఆరుగురి ముఠాను అరెస్టు చేశారు. లబ్ధిదారులకు చెందిన చెక్కులను నకిలీ పేర్లతో రీవాలీడేషన్ చేయించి ఆ డబ్బును డ్రా చేయడానికి పాల్పడ్డారు. మొత్తం 44 చెక్కులకు సంబంధించి 38 చెక్కులను ఇప్పటికే విత్ డ్రా చేసిన ముఠా, మిగిలిన ఆరు చెక్కులను కూడా విత్ డ్రా చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులకు చిక్కారు.పోలీసులు ఆ ముఠాను అరెస్టు చేసి వారి నుంచి రూ.9.30 లక్షల నగదు, 6 డ్రా చేయని చెక్కులు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కె. నరసింహ ఆదేశాల మేరకు కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, పట్టణ సీఐ శివశంకర్ పర్యవేక్షణలో ఈ అరెస్టులు జరిగాయి.

## భక్తులకు అలర్ట్ యాదగిరిగుట్ట ఆలయం మూసివేత



**యాదాద్రి, సెప్టెంబరు6 :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని (ఆదివారం) సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా 12 గంటలకు మూసివేయను న్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయాన్ని మూసివేసి ఎల్లుండి ఉదయం తెల్లవారుజామున 3.30గంటలకు ఆలయా న్ని తెరువనున్నారు ఆలయ అధికారులు. ఈ మేరకు ఆలయ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం రాత్రి 9.56కు ప్రారంభమై రాత్రి 1.26గంటలకు ముగియనుంది సంపూర్ణ చంద్ర గ్రహణం. మధ్యాహ్నం 12 గంటల అనంతరం దర్శనాలు, నిత్యా కైంకర్యాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, వాహన పూజలు నిలిపివేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఎల్లుండి ఉదయం 3.30కి ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ కార్యక్రమంతో పాటు యథావిధిగా నిత్యా కైంకర్యాలు నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ డెన్ 12వేల కోట్ల మాదక ద్రవ్యాలు స్వాధీనం



**హైదరాబాద్:** లో భారీ డ్రగ్స్ తయారీ కేంద్రం గుట్టురట్టయ్యింది. మేడ్చల్ జిల్లాలో శనివారం మహారాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ స్పెషల్ ఆపరేషన్ నిర్వహించింది. మహారాష్ట్రలో తీగ లాగితే.. హైదరాబాద్ లో డ్రగ్స్ డొంక బయటపడింది. హహారాష్ట్ర క్రైమ్ బ్రాంబ్ దాడిలో పెద్దఎత్తున డ్రగ్స్ తయారుచేస్తున్నట్టు గుర్తించారు. మేడ్చల్ జిల్లా పరిధి చర్లపల్లిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ఈ దాడుల్లో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ లభ్యమయ్యాయి. 32 వేల లీటర్ల రా మెటీరియల్ స్వాధీనం చేసుకున్నారు. 13 మందిని మహారాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేశారు..కెమికల్ ఫ్యాక్టరీ మాటున డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇక్కడ తయారైన డ్రగ్స్ దేశవ్యాప్తంగా సరఫరా అవుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌కి చెందిన మహిళ అరెస్ట్ తో ఈ డ్రగ్స్ గుట్టు బయటపడింది. మహారాష్ట్ర పోలీసుల దాడులతో.. తయారీదారులు, సరఫరాదారుల నెట్‌వర్క్ మొత్తం గుట్టురట్టయింది. ఫ్యాక్టరీలో పెద్దఎత్తున ఎండీ డ్రగ్స్ తయారీని గుర్తించారు.

## అగాథంలోకి తెలంగాణ మేల్కొనండి రేవంత్ రెడ్డి గారూ



**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. తెలంగాణలో విద్యా వ్యవస్థ అధపాతాళంలోకి పోతుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీల్లో ఇప్పటికీ పాఠ్య పుస్తకాలు అందలేదు. ఈ అంశంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు.విద్యా సంవత్సరం ప్రారంభమై నేటి మూడు నెలలైంది. అయినా చాలా కాలేజీల్లో ఇప్పటికీ పాఠ్య పుస్తకాలు రాలేదని విద్యార్థులు రోదిస్తున్నారు. ఇందుకోసమేనా తమరు విద్యాశాఖను తమరి దగ్గరనే పెట్టుకున్నారా..? మీ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి దిశగా దూసుకుపోవడం లేదు.. ఇది నిజం.. అగాథంలోకి తెలంగాణ పోతుందని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మేల్కొనాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.

# హైదరాబాద్‌లో ప్రశాంతంగా గణనాథుల నిమజ్జనం.

**హైదరాబాద్, సెప్టెంబర్ 6:** నగరంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరుగుతోందని రాష్ట్ర డీజీపీ జితేందర్ చెప్పారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో అన్ని చోట్ల నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోంద న్నారు. గణనాథుల నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌లో మూడు కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక బలగాలు మోహరించా యని తెలిపారు. రాష్ట్రంలో ఎంతో కీలకమైన ఖైరతాబాద్ గణేషుడి నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని డీజీపీ జితేందర్ చెప్పారు. బాలాపూర్ గణపతి శోభాయాత్ర ప్రారంభమైందని.. నాలుగు గంటల్లోపు బాలాపూర్ వినాయకుడి నిమజ్జనం పూర్తవుతుందని డీజీపీ వివరించారు.వినాయక నిమజ్జనం (ఆదివారం) వరకు కొనసాగుతుందని డీజీపీ తెలిపారు. ప్రజలు కూడా త్వరగా నిమజ్జనం పూర్తి చేసేందుకు సహకరించాలని డీజీపీ జితేందర్ విజ్ఞప్తి చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అదనంగా ప్రత్యేక ఫోర్స్ విధుల్లో ఉందని తెలిపారాయన. డీజీపీ కార్యాలయం, బంజారాహిల్స్ లోని ఐసీసీసీ లో కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈసారి ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా నిమజ్జనం విధుల్లో పాల్గొందని డీజీపీ తెలిపారు.




పోలీసులతో పాటు ఎక్సైజ్, ఫారెస్ట్, ఆర్పీఫ్, ఎస్‌టీఎఫ్ సిబ్బంది కూడా విధుల్లో ఉన్నారని చెప్పారు.ఇదిలాఉండగా.. నగరం నలుమూలల నుంచి వినాయక విగ్రహాలు గంగమ్మ ఒడిని చేరేందుకు హుస్సేన్ సాగర్ వైపు కదులుతున్నాయి. ఖైరతాబాద్ బడా గణేష్ నిమజ్జనం పూర్తవడంతో.. నగరంలో మిగతా పెద్ద పెద్ద విగ్రహాలు నిమజ్జనానికి సిద్ధమయ్యాయి. శోభాయాత్ర సాగే రూట్లన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వినాయక శోభాయాత్రను చూడటానికి భక్త జనం భారీగా తరలి వస్తున్నారు.బాలాపూర్ గణేషుడు చార్మినార్ వద్దకు చేరుకున్నా డు. చార్మినార్ మీదుగా ట్యాంక్ బండ్‌కు తరలివస్తున్నాడు. బాలాపూర్ గణేషుడిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో చార్మినార్ వద్ద కోలాహల వాతావరణం నెలకొంది. మరోవైపు ఎంజే మార్కెట్ వద్ద కూడా భక్తుల రద్దీతో కోలాహలంగా ఉంది. విపరీతమైన రద్దీ ఉండటంతో 500 మంది సిబ్బందితో పోలీసులు ట్రాఫిక్‌ని క్లియర్ చేస్తున్నారు. ప్రసాద పంపిణీల వల్ల రద్దీ పెరిగిపోతోంది. ఇక మహిళలకు ఇబ్బంది కలుగకుండా ఎప్పటికప్పుడు షీ టీమ్స్ పర్యవేక్షిస్తున్నా యి. మరోవైపు ఆదివారం నాడు చంద్రగ్రహణం ఉండటంతో.. త్వరత్వరగా నిమజ్జనం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

# రికార్డు స్థాయిలో బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం

**హైదరాబాద్ :** భాగ్యనగరంలో అందరి దృష్టిని ఆకర్షించే బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంపాట పూర్తైంది. గతేడాది కంటే రూ.4లక్షల 99వేలు అధికంగా పలికిన లడ్డూ వేలం పాట ఈ యేడు రికార్డు సృష్టించింది.. ఏకంగా రూ.35 లక్షలు పలికింది. కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ అనే వ్యక్తి రూ.35 లక్షలకు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. బాలాపూర్ లంబోదరుడి చేతిలో నవరాత్రులు పూజలందుకున్న లడ్డు వేలం పాటతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుంది. అందుకే గణేశుడి లడ్డూ వేలం పాట కోసం సర్వత్రా ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు భక్తులు.ఈ సంవత్సరం కూడా బాలాపూర్ గణేషుడి లడ్డూ వేలం అత్యంత ఉత్సాహంగా , ఉత్కంఠభరితంగా సాగింది. లడ్డూ వేలం పాటలో పాల్గొనేందుకు 38 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. స్థానికులు, స్థానికేతరుల మధ్య జరిగే ఈ వేలంపాటలో నువ్వా నేనా అన్నట్లుగా వేలం పాట జరుగుతుంది. ప్రతి ఏటా పెరుగుతున్న లడ్డూ వేలం రూ.35 లక్షలు పలికింది. కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్‌గౌడ్ ను ఈ సారి




అదృష్టం వరించింది. గత ఏడాది 30 లక్షల వెయ్యి రూపాయలకు వేలంలో దక్కించుకున్నారు కొలన్ శంకర్‌రెడ్డి. 1994లో 450 రూపాయలతో మొదలైన లడ్డూ వేలం పాట ఇక్కడ ఒక సంప్రదాయంగా మారింది. ఇక్కడ మరో ప్రత్యేకత కూడా ఉంది. ఇక్కడ లడ్డూ వేలంపాట ద్వారా వచ్చే నగదును గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేస్తుంది ఉత్సవ సమితి. ఇప్పటి వరకు కోటి 64 లక్షల 87 వేల 970లు ఖర్చు చేసినట్లు ఉత్సవ సమితి సభ్యులు చెబుతున్నారు.ప్రతి సంవత్సరంలానే ఈ ఏడాది కూడా బాలాపూర్? లడ్డూ వేలం పాట జరిగింది. పార్టీలకు అతీతంగా ఇక్కడ వినాయక ఉత్సవాలు , లడ్డూ వేలం పాట నిర్వహిస్తున్నారు. ఈ యేడు వేలం పాటకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ బాలాపూర్‌లో పుట్టిన వాళ్లంతా అదృష్టవంతులేనని అన్నా రు. బాలాపూర్ గణనాథుడు కొలువుదీరిన ఈ మహేశ్వరం నియోజకవర్గానికి ఎమ్మెల్యే అవ్వడం అదృష్టం అన్నారు సబితా.

# నా జీవితం తెలంగాణ ప్రజల ముందు తెరిచిన పుస్తకం

**హైదరాబాద్ :** విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి చేరుకున్నారు మాజీ మంత్రి హరీష్ రావు.. తనపై కవిత చేసిన ఆరోపణలపై స్పందించారు. నా జీవితం తెలంగాణ ప్రజల ముందు తెరిచిన పుస్తకం అన్నారు. కొందరు నాయకులు, పార్టీలు చేసిన ఆరోపణలే కవిత చేశారు. కవిత వ్యాఖ్యలు ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా అని హరీష్ రావు తెలిపారు. కవిత విషయంలో పార్టీ ఇప్పటికే ఓ నిర్ణయం తీసుకుందని హరీష్ గుర్తు చేశారు.కవిత వ్యాఖ్యలను లైట్ తీసుకున్న హరీష్.. ప్రజల కష్టాలపైనే తమ ఫోకస్ ఉంటుందని ఎయిర్‌పోర్టులో స్పందించారు. రాష్ట్ర సాధనలో నా నిబద్ధత, పాత్ర అందరికీ తెలిసిందే అని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. రెండున్నర దశాబ్దాలుగా క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా ఉన్నానని, ఎవరి విషయంలోనైనా పార్టీ నిర్ణయమే ఫైనల్. పార్టీకి కేసీఆరే సుప్రీం అని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తెస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు.మరోవైపు రేవంత్ సర్కార్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు హరీష్ రావు. ఎరువుల దొరకక రైతులు గోస పడుతున్నారు. వరదలతో



ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దకాలం మేం ఎంతో కష్టపడి నిర్మించిన వ్యవస్థలను.. ఒక్కొక్కటిగా కాంగ్రెస్ ప్రభుత్వం కూలుస్తూ వస్తుందని హరీష్ రావు విమర్శించారు. తెలంగాణ ద్రోహుల నుంచి రాష్ట్రాన్ని కాపాడటమే మా లక్ష్యమని హరీష్ అన్నారు. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని హరీష్ ధీమా వ్యక్తం చేశారు.ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా హైదరాబాద్‌లోని తన నివాసానికి వెళ్లిన హరీష్‌రావు.. అక్కడి నుంచి పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్లనున్నారు. విదేశీ పర్యటన తర్వాత శనివారం (సెప్టెంబర్ 6) ఎర్రవెల్లికి వెళ్లనున్నారు హరీష్‌రావు. ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా కవిత వాఖ్యలపై కేసీఆర్‌తో చర్చించనున్నారు హరీష్. కేసీఆర్‌తో చర్చించాక ఎలా స్పందిస్తారో అన్నదీ ఉత్కంఠగా మారింది.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు ముందుకు సాగేనా. నష్టాల ఊబిలో జయప్రకాశ్ ఏజెన్సీ

**శ్రీశైలం :** శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులు ప్రశ్నార్థకంగా మారాయి. ఒక వైపు ప్రభుత్వం 2027 కల్లా సొరంగం పనులను పూర్తి చేస్తామని ప్రగల్బాలు పలుకుతున్నా మరోవైపు క్షేత్రస్థాయి పరిస్థితులు ఆశాజనకంగా ఏమీ లేవు. పనులను చేపట్టిన జయప్రకాశ్ అసోసియేట్స్ కంపెనీ తీవ్ర నష్టాల్లో కూరుకుపోవడంతో సుదీర్ఘకాలంగా పనులు జాప్యానికి కారణమని తెలుస్తున్నది. తాజాగా ఆ కంపెనీని వేదాంత కంపెనీ కొనుగోలు చేసిసింది. అయితే అదీ తీవ్రమైన నష్టాల్లోనూ కొనసాగడం కొసమెరుపు. దీంతో పనుల కొనసాగింపు సాధ్యామా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ 44 కి.మీ పొడవు. దానిని రెండు వైపులా నుంచి టీబీఎం టెక్నాలజీతో చేపట్టేందుకు జయప్రకాశ్ కంపెనీ పనులను చేజిక్కించుకుంది. అమెరికాకు చెందిన రాబిన్స్‌సన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటివరకు కేవలం 34 కి.మీ టన్నెల్‌ను మాత్రమే పూర్తి చేసింది. ఇటీవలనే ఇన్‌లెట్ టన్నెల్‌లో సొరంగం పైకప్పు కూలిపోవడంతో పనులు నిలిచిపోయాయి. వాస్తవంగా 2005లో జయప్రకాశ్ ఏజెన్సీ ఎస్ఎల్‌బీసీ పనులను దక్కించుకుంది. అప్పటికీ కంపెనీ లాభాల్లోనే ఉన్నది. ఆదిలో పనులు సజావుగా కొనసాగాయి. టీబీఎంలు కొత్తవి కావడం, కంపెనీ సైతం లాభల్లో ఉండడంతో పనులు వడివడిగానే కొనసాగాయి.కానీ 2009 నాటికి జయప్రకాశ్ కంపెనీ నష్టాల్లోకి జారుకున్నది. ఇది మొదలు ఎస్-ఎల్‌బీసీ పనులు మందకొడిగా సాగడం మొదలైంది. ప్రభుత్వం ఏజెన్సీకి డబ్బులు చెల్లించినా, జయప్రకాశ్ కంపెనీ తాను




ఒప్పందం చేసుకున్న రాబిన్స్‌సన్స్ కంపెనీకి సకాలంలో చెల్లింపులను చేయలేదు. ప్రభుత్వం చెల్లించిన డబ్బులను ఎప్పటికప్పుడు నష్టాలను పూడ్చుకోవడానికి వినియోగించింది తప్ప పనుల నిర్వహణకు వినియోగించింది తక్కువ. దీంతో టన్నెల్ పనులు జాప్యానికి గరవుతూ వస్తున్నాయి. ఇప్పటికీ 9.6కిమీ టన్నెల్‌ను పూర్తిచేయాల్సి ఉంది. గత ఫిబ్రవరిలో ఎట్టకేలకు ఇన్‌లెట్ టన్నెల్ వైపు నుంచి పనులను ప్రారంభించింది. ప్రారంభించిన మూడు రోజులకే టన్నెల్ పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాదంలో 8మంది కార్మికులు సొరంగంలో గల్లంతయ్యారు. ఇప్పటికీ2 మృతదేహాలను మాత్రమే వెలికితీయగా, ఇప్పటికీ 6 కార్మికుల అచూకీ లభించలేదు. మరోవైపు టన్నెల్ తవ్వకం ఆగిపోయింది.ఇదిలా ఉంటే నష్టాల ఊబిలో కూరుకుపోయి, బ్యాంకు రుణాలను చెల్లించలేక జయప్రకాశ్ కంపెనీ దివాళా తీసింది. కంపెనీని అమ్మకానికి సిద్ధపడింది. అయితే ఈ క్రమంలో బిడ్లను ఆహ్వానించింది. రెండు ప్రధాన కంపెనీలు పోటీ పడ్డాయి. అదానీ గ్రూప్ రూ. 12000 కోట్లకు బిడ్‌ను దాఖలు చేసింది. అయితే వేదాంత కంపెనీ ఏకంగా రూ. 17000 కోట్లతో బిడ్ దాఖలు చేసింది. దీంతో జయప్రకాష్ కంపెనీని వేదాంతం స్వాధీనం చేసుకోవడం ఖరారైంది. అంతవరకు బాగానే ఉన్నా వేదాంత కంపెనీ సైతం నష్టాల్లోనూ ఉండడం ఇక్కడ కొసమెరుపు. వేదాంత కంపెనీ సైతం ఇటీవల రూ. 57,185 కోట్ల రుణాలను చెల్లించడంలో విఫలమైంది. తాజాగా ఆ కంపెనీనే జయప్రకాశ్ కంపెనీని కొనుగోలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే టన్నెల్ పనులపై అనుమానాలను రేకెత్తిస్తున్నది.

# తెలంగాణలో పింఛన్లు పెంచే వరకు ఉద్యమం: మందకృష్ణ మాదిగ

**తాండూర్ :** తెలంగాణలో పింఛన్లు పెంచే వరకు ప్రభుత్వంపై ఉద్యమాలు చేపడుతూనే ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు . శనివారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో చేపట్టిన మహా గర్జన సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ. 200కు పెంచారని , దశలవారీగా ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటలతోనే 2014లో అన్ని పార్టీలు వేయి రూపాయల పెన్షన్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాయని గుర్తు చేశారు. తమ పోరాటాల ఫలితంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వెయ్యి రూపాయల పెన్షన్ పెంపు సాధ్యమైందన్నారు.అనంతరం 2019 ఎన్నికల్లో కూడా ఎమ్మార్పీఎస్ ఒత్తిడితోనే రూ. 2 వేల పెన్షన్ పెంపు సాధ్యమైందన్నారు 2023లో రూ. 4వేల పెన్షన్‌ను ఇస్తామని



అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 21 నెల లైనా ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులతో ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పెన్షన్ పెంపును విస్మరించడం సరికాదన్నారు. ఈ పెన్షన్ పెంపు చేపట్టే వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈనెల 8న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, 20న మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధం తోపాటు దశల వారి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి జిలకర శంకర్, నాయకులు గణేష్, ఉన్నారు.

# దేశ సంపద పెరగడానికి జీఎస్టీ సంస్కరణలు దోహదం



**అమరావతి, సెప్టెంబరు6 :** దేశ సంపద మరింత పెరిగేందుకు కొత్త జీఎస్టీ సంస్కరణలు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం నూతన జీఎస్టీ సంస్కరణలు తీసుకురావడాన్ని తెలుగుదేశం పార్టీ స్వాగతిస్తోందని పేర్కొన్నారు. ఇశనివారం అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విజయ్ కుమార్ మాట్లాడారు. గత 50 ఏళ్ల చరిత్రలో ఇలాంటి పన్ను సంస్కరణలు ఏ కేంద్ర ప్రభుత్వం తీసుకురాలేదని చెప్పుకొచ్చారు.నూతన జీఎస్టీ సంస్కరణలతో వ్యవసాయ, నిర్మాణ రంగం, ఇతర రంగాల అభివృద్ధికి దోహదపడతాయని నొక్కిచెప్పారు. కొత్త జీఎస్టీ పన్నుల విధానంతో ప్రజలకు కొనుగోలు శక్తి పెరుగుతోందని తెలిపారు. పౌల్ట్రీ పరిశ్రమకు ఐదు శాతం తగ్గింపు, పాల ఉత్పత్తులపై సున్నా పన్ను విధానంతో ఏపీకి ఆదాయం పెరుగుతోందని వివరించారు. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై టారిఫ్‌లు విధించినా మనకు ఎక్కడా ఆర్థిక భారం పడకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. నిత్యవసర వస్తువుల ధరలు తగ్గడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు చౌకగా వస్తువులు లభిస్తాయని తెలిపారు విజయ్ కుమార్.జీఎస్టీ సవరణలతో టెంపుల్ టూరిజం అభివృద్ధికి, రియల్ ఎస్టేట్ రంగానికి చాలా ప్రయోజనకరమని వివరించారు. ఆటోమొబైల్స్ రంగంలో 10 శాతం పన్ను తగ్గించడంతో కారు ధరలు రూ.లక్ష వరకు తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. ఏపీ ఆదాయం పెరిగితే గత ప్రభుత్వంలో మాదిరిగా దోపిడీ చేయకుండా, సంక్షేమానికి ఉపయోగించవచ్చని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా చంద్రబాబు సంస్కరణలు తీసుకొచ్చారని... సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబు అని నీలాయపాలెం విజయ్ కుమార్ పేర్కొన్నారు.

# యూరియాపై రాద్దాంతం చేస్తున్నారు జగన్‌పై వర్మ ఫైర్



**కాకినాడ జిల్లా పిఠాపురం, సెప్టెంబరు6 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే వత్సవాయి సత్యనారాయణ వర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుకు కావాల్సినంత యూరియా అందుతున్న జగన్ కావాలని రాద్దాంతం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాకినాడ జిల్లాకు 23,359 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. ఇప్పటికే 19, 385 మెట్రిక్ టన్నుల యూరియా సొసైటీల ద్వారా అందిందని వివరించారు సత్యనారాయణ వర్మ.శనివారం పిఠాపురంలో వర్మ మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా యూరియాను అమ్ముకునే వారని ఆరోపించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎమ్మార్పీ రేటుకే యూరియా అందుతుంటే జగన్‌కు కనిపించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు యూరియాను సంపూర్ణంగా రైతులకు అందించని ఘనత వైసీపీదేనని ఆక్షేపించారు. జగన్ హయాంలో ధాన్యం రైతులకు ఏడాది గడిస్తేనే కానీ పైసలు వచ్చేవి కాదని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో నెల రోజుల్లోనే అన్నదాతలకు డబ్బులు అందించి రైతు పక్షపాతిగా చంద్రబాబు నిలిచారని మాజీ ఎమ్మెల్యే వత్సవాయి సత్యనారాయణ వర్మ పేర్కొన్నారు.

# జేసీపై పంతం నెగ్గించుకున్న కేతిరెడ్డి ఎట్టకేలకు తాడిపత్రిలోకి ఎంట్రీ



**అమరావతి:** వైసీపీ సీనియర్ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎట్టకేలకు తన పంతం నెగ్గించుకున్నారు. అన్ని అవాంతరాలు దాటుకుని సుప్రీంకోర్టు అనుమతి తీసుకుని మరీ ఆయన తాడిపత్రిలోకి అడుగుపెట్టారు. టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ జేసీ ప్రభాకర్ రెడ్డితో కేతిరెడ్డి పెద్దారెడ్డికి చాలా రోజులుగా గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దాదాపు 15 నెలలుగా కేతిరెడ్డిని తాడిపత్రికి రాకుండా జేసీ అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి, పోరాటం చేసి మరీ ఇవాళ కేతిరెడ్డి తాడిపత్రిలోకి అడుగుపెట్టారు. 672 మంది పోలీసు బందోబస్తు నడుమ తన ఇంటికి చేరుకున్నారు.ఈ సందర్భంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 15 నెలల తర్వాత తాడిపత్రికి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు భద్రత కల్పించారని పేర్కొన్నారు. పోలీసులకు అన్నివిధాలుగా సహకరిస్తానని చెప్పారు. తాడిపత్రి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాడిపత్రిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.తాడిపత్రిలో కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్సెస్ జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేతిరెడ్డిని తాడిపత్రిలోకి అడుగుపెట్టనీయకుండా ఆయన్ను జేసీ అనుచరులు అడ్డుకుంటున్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు కూడా కేతిరెడ్డిని వెనక్కి పంపించేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించడంతో.. ఆగస్టు 18వ తేదీన పోలీసులే స్వయంగా కేతిరెడ్డిని తాడిపత్రిలో దించిరావాలని ఆదేశాలు ఇచ్చింది. కానీ అదే రోజున జేసీ వేరే ఈవెంట్ ఏర్పాటు చేయడంతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు తాడిపత్రికి రావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కేతిరెడ్డిని తాడిపత్రిలోకి అడుగుపెట్టనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు ఏపీ హైకోర్టును ఆశ్రయించడంతో.. కేతిరెడ్డిని తాడిపత్రికి రావద్దని ఆదేశించింది. దీనిపై తాజాగా కేతిరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు తాడిపత్రికి వెళ్లేందుకు కేతిరెడ్డికి అనుమతినిచ్చింది. అవసరమైతే ప్రైవేటు బందోబస్తును కూడా ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది. ఈ క్రమంలో ఆయన భారీ పోలీసుల బందోబస్తు నడుమ తాడిపత్రిలోకి అడుగుపెట్టారు.

# సెప్టెంబరు 9న ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవం




**విజయవాడ, సెప్టెంబరు6:** ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 27, 28వ వార్షిక స్నాతకోత్సవ వేడుకలు ఈ నెల (సెప్టెంబరు) 9వ తేదీన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగనున్నాయి. ఈ మేరకు ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వీసీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి (శనివారం) మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన ఈ స్నాతకోత్సవం జరుగనుందని తెలిపారు.ఈ స్నాతకోత్సవంలో 120 మంది విద్యార్థులకు 156 బంగారు, వెండి పతకాలు, క్యాష్ ప్రైజెస్ అందించనున్నామని పేర్కొన్నారు. 115 గోల్డ్, 41 సిల్వర్, 38 మందికి క్యాష్ ప్రైజ్ ఇవ్వనున్నామని ప్రకటించారు. న్యూఢిల్లీకి చెందిన నేషనల్ హార్ట్ ఇనిస్టిట్యూట్ సీఈవో డాక్టర్ ఓపీ యాదవ్‌కు డాక్టర్ ఆఫ్ సైన్సెస్ గౌరవ డిగ్రీ అందించనున్నామని చెప్పుకొచ్చారు. పీహెచ్డీ చేసిన ఐదుగురికి, సూపర్ స్పెషాలిటీలో ఒకరికి డిగ్రీ సర్టిఫికెట్ల చేయనున్నామని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి వెల్లడించారు.

# టీడీపీ శ్రేణులకు మంత్రి సూచన బొట్టుపెట్టి పిలవండి



**అనంతపురం:** 'అనంతపురం అర్బన్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లండి.. ఆడపడుచులకు బొట్టుపెట్టి, సూపర్‌హిట్ సభకు ఆహ్వానించండి. అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచే లక్ష మంది కదిలి రావాలి' అంటూ మంత్రి కొల్లు రవీంద్ర టీడీపీ శ్రేణులకు సూచించారు. నగరంలోని మారుతీనగర్ సాయిబాబా గుడి కల్యాణమండపంలో శుక్రవారం అర్బన్ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. అందుకే ఎన్నికల్లో కూటమి పార్టీలకు 175 స్థానాలకు 164 కట్టబెట్టారన్నారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పింఛన్‌ను రూ.4వేలకు పెంచామన్నారు. దివ్యాంగుల ఫించన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, బెడ్‌పై లేవలేని స్థితిలో ఉన్న వాళ్లకు రూ. 15 వేలు, దీర్ఘకాలిక జబ్బులతో ఉన్న వాళ్లకు రూ.10 వేలు ఇచ్చామన్నారు. ఏడాది కాలంలోనే పింఛన్ల కోసం రూ.35 వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవన, తల్లికి వందనం 16,400 డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇవన్నీ కూటమి ప్రభుత్వమే అందించిందని తెలిపారు.ఈ విషయాలన్నీ ప్రజలకు తెలిపేందుకు అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ గత 44 ఏళ్లలో తొలిసారి అనంతపురంలో భారీ బహిరంగ సభ జరగబోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనపై పెట్టిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలన్నారు. 3.5 లక్షల మంది సభకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. టీడీపీ జోన్-5 ఇన్‌చార్జ్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు కష్టపడి కూటమిని గెలిపించారని, ఇప్పుడు ఈ విజయోత్సవ సభను సైతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అర్బన్ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 11 సీట్లు ఇచ్చినా జగన్‌కు బుద్ధి రాలేదన్నారు. తిరుమల పవిత్రతను సైతం దెబ్బతియ్యాలని చూశాడని, ఆఖరికి టికెట్లు కూడా అమ్ముకున్నారంటూ మండిపడ్డారు. 10న జరిగే సభను విజయవంతం చేయాలని సూచించారు. అంతకు ముందు ఆప్కాబ్ చైర్మన్ గండి వీరాంజనేయులు మాట్లాడుతూ వైసీపీ నాయకుల ఫేక్ ప్రచారాలను టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని చాలెంజ్‌గా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు.ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ అనంతపురం ఉమ్మడి జిల్లా టీడీపీకి కంచుకోట అన్నారు. కార్యక్రమంలో లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, జేయల్ మురళి, స్వామిదాస్, మదమంచి స్వరూప, డైరెక్టర్లు పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, బొమ్మినేని శివ, పరమేశ్వర్, కొండన్న, నాయకులు సుధాకర్‌నాయుడు, చేపలహరి, సుధాకర్ యాదవ్, సింగవరం రవి, నెట్టెం బాలకృష్ణ, తేజస్విని, హరి పాల్గొన్నారు.

# వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి మధ్యంతర బెయిల్



**రాజమండ్రి :** ఏపీ లిక్కర్ స్కాం కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఊరట దక్కింది. ఆయనకు విజయవాడ ఏసీబీ స్పెషల్ కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఓటు వేసేందుకు అనుమతిని ఇస్తూ శనివారం నాడు ఉత్తర్వులు ఇచ్చింది. బెయిల్ కోసం రూ.50వేల పూచీకత్తుతో పాటు రెండు షూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. తిరిగి ఈ నెల 11వ తేదీన సరెండర్ కావాలని సూచించింది.ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఎంపీ మిథున్ రెడ్డిని ఏసీబీ ఏ4గా చేర్చింది. ఈ నేపథ్యంలో జూలై 19వ తేదీన ఆయనను విజయవాడలోని కార్యాలయంలో దాదాపు ఏడు గంటల పాటు సిట్ అధికారులు విచారణ జరిపారు. అనంతరం అదే రోజు రాత్రి ఆయన్ను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. అప్పటి నుంచి ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలులోనే రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అప్పటి నుంచి ఆయన బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కానీ ఆయనకు బెయిల్ దొరకడం లేదు. ఈ క్రమంలో ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటు వేసేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఆయనకు మధ్యంతర బెయిల్ దొరకడం గమనార్హం.

# లిక్కర్ కేసులో కీలక పరిణామం ముగ్గురికి బెయిల్



**విజయవాడ:** ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మద్యం కుంభకోణంలో కేసులో నిందితులుగా ఉన్న ఏ31-ధనుంజయ రెడ్డి, ఏ32-కృష్ణ మోహన్ రెడ్డి, ఏ-33 బాలాజీ గోవిందప్పలకు ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ సంచలన తీర్పు వెలువరించింది. ముగ్గురు నిందితులు డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇరువర్గాల వాదనలు ముగిసినట్లు తెలిపింది. ఈ మేరకు ఇవాళ(శనివారం) ముగ్గురికీ బెయిల్ మంజూరు చేస్తూ.. ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు మే 14న బాలాజీ గోవిందప్ప, మే 17న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలను సిట్ అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలో ముగ్గురు బెయిల్ కోసం.. ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఏసీబీ కోర్టు విచారణ చేపట్టింది. ఈ మేరకు ఇవాళ(శనివారం) బెయిల్ మంజూరు చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే.. ముగ్గురు పాస్‌పోర్ట్‌లు అధికారులకు అప్పగించాలని కోర్టు ఆదేశించింది. ఒక్కొక్కరు లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని తెలిపింది.జగన్ ప్రభుత్వం హయాంలో మద్యం విక్రయాల లావాదేవిలన్ని నేరుగా జరిగాయి. అంటే ఎక్కడ డిజిటల్ చెల్లింపులు అనేవి జరగలేదు. దీంతో ఈ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం విక్రయాలకు తెర తీశారు. ఈ మద్యం తాగడం వల్ల అనేక మంది మృత్యువాత పడ్డారు. అలాగే పలువురు అనారోగ్యానికి గురయ్యారు. అంతేకాకుండా.. ఈ మద్యం విక్రయాల్లో భారీగా అవినీతి చోటు చేసుకుందంటూ ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం కుంభకోణంపై సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డిను సిట్ అధికారులు అరెస్ట్ చేసి.. విచారించారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు బాలాజీ గోవిందప్పలను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు.

# ఈ నెల 9న యూరియా కొరతకు నిరసనగా ఏపీలో వైసీపీ నిరసనలు




**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగ సమస్యలపై వైసీపీ పోరుబాట పట్టనుంది. యూరియా కొరతతో పాటు రైతుల సమస్యలపై ఈనెల 9న ఏపీలోని అన్ని ఆర్డీవో కార్యాలయాల ఎదుట శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి (అన్నదాత పోరు పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు.అనంతం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జోరుగా సాగు జరుగుతుంటే మరోవైపు యూరియ దొరకక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతులు యూరియా అడుగుతుంటే బొక్కలో తోస్తానంటూ సీఎం చంద్రబాబురైతులను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందని విమర్శించారు. యూరియాను టీడీపీ నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించారని మండిపడ్డారు.యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడడం సీఎం కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం మెడలు వంచేంత వరకు వైసీపీ వెనుకడుగు వేయదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లేళ్ల అప్పిరెడ్డి, అరుణ్‌కుమార్, నందిగం సురేష్, వెల్లంపల్లి శ్రీనివాస్, టీజేఆర్ సుధాకర్ బాబు, భాగ్యలక్ష్మి, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

# జగన్ పాలనలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయి.



**అమరావతి:** వైద్య రంగం నిధులను దోపిడి చేసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి తన ధన దాహాన్ని తీర్చుకున్నారని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా భ్రష్టుపడ్డ.. అనేక వ్యవస్థలను తిరిగి స్థాపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తీవ్ర కృషి జరుగుతోందని తెలిపారు. గతంలో జగన్మోహన్ రెడ్డి అవినీతి దాహానికి బలి అయిపోయిన రంగాలను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని ధీమా వ్యక్తం చేశారు.వైద్యరంగం నిర్లక్ష్యం.గత ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో వైద్యశాఖ తీవ్రంగా దెబ్బతిన్నట్లు కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. దాని పర్యవసానాలను కోవిడ్ సమయంలో అందరూ ప్రత్యక్షంగా అనుభవించారని చెప్పుకొచ్చారు. 14 సంవత్సరాల ముఖ్యమంత్రి కాలంలో చంద్రబాబు రాష్ట్రానికి 22 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. జగన్ రెడ్డి ఐదు సంవత్సరాలలో కేవలం ఐదు కాలేజీలను మాత్రమే తెచ్చారని విమర్శించారు. అవి కూడా నిర్మాణాలు పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి అసంపూర్ణంగా వదిలిపోయిన కాలేజీ నిర్మాణాలను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోందని స్పష్టం చేశారు. ఇంకా అదనంగా 10 కొత్త మెడికల్ కాలేజీలను పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య మోడల్‌లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. జగన్ ఊరువాడా డప్పు కొడుతున్నారు.అయితే.. 17 మెడికల్ కాలేజీలు తెచ్చానని ఊరువాడా డప్పు కొట్టుకుంటున్న జగన్మోహన్ రెడ్డి రూ.8,480 కోట్లకు గాను కేవలం రూ.1,451 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆరోపించారు. ఇందులో రూ.975 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందించిందని పేర్కొన్నారు. జగన్ రెడ్డి నియోజకవర్గం పులివెందుల కాలేజీకి రూ.168 కోట్లు పెండింగ్ వర్క్స్ ఉన్నాయని తెలిపారు. జాతీయ వైద్య మండలి ఏడేరు, మార్కాపూరు, మదనపల్లి, ఆదోని, పులివెందులల్లోని నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేసిందని ఆయన చెప్పుకొచ్చారు.

# క్రికెటర్ ఉన్ముక్త్ చంద్ జీవితంపై డాక్యుమెంటరీ.



టీమిండియా అండర్-19 క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, 2012లో ప్రపంచ కప్‌ను సాధించి పెట్టిన డాషింగ్ క్రికెటర్ ఉన్ముక్త్ చంద్ జీవిత కథపై డాక్యుమెంటరీ తెరకెక్కుతుంది. అతని జీవిత ప్రయాణం ఆధారంగా తెరకెక్కిన డాక్యుమెంటరీ చిత్రం 'అన్‌బ్రోకెన్: ది ఉన్ముక్త్ చంద్ స్టోరీ'(). రాఘవ్ ఖన్నా దర్శకత్వం వహించిన ఈ డాక్యు మెంటరీని రివర్‌ల్యాండ్ ఎంటర్‌టైన్‌మెం ట్, తుడిప్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మించా యి. దీప్తి అగర్వాల్, జైశ్రీ ఖన్నా, తుషార్ ఉప్‌శంకర్, మరియు రాఘవ్ ఖన్నా నిర్మాతలుగా వ్యవహరించగా, ప్రియాంక చౌదరి సహ నిర్మాతగా ఉన్నారు. ఈ డాక్యుమెంటరీ 12న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను పంచుకున్నారు మేకర్స్. ఉన్ముక్త్ చంద్ క్రికెట్ కెరీర్2012లో ఆస్ట్రేలియాలో జరిగిన ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన ఉన్ముక్త్ చంద్ ఫైనల్లో ఆతిథ్య జట్టుపై అద్భుతమైన సెంచరీ (111 నాటౌట్) చేసి జట్టుకు కప్ అందించాడు. ఈ విజయంతో అతను క్రికెట్ ప్రపంచంలో ఒక సంచలనంగా మారాడు. అనంతరం ఉన్ముక్త్ దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ, ఉత్తరాఖండ్ జట్ల తరపున ఆడాడు. రంజీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ వంటి టోర్నమెంట్లలో పాల్గొన్నాడు. ఇక దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించినప్పటికీ, సీనియర్ భారత జట్టులో స్థానం దక్కించుకోలేకపోయాడు. దీంతో, 2021లో భారత క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించి, అమెరికాకు వెళ్లాడు. ప్రస్తుతం ఉన్ముక్త్ చంద్ అమెరికాలో మేజర్ లీగ్ క్రికెట్ లాస్ ఏంజెల్స్ నైట్ రైడర్స్ వంటి జట్టు తరపున ఆడుతున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్, మరియు ముంబై ఇండియన్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

# యువీ అంటే ధోనీ, కోహ్లీకి భయం



డాషింగ్ బ్యాటర్ యువరాజ్ సింగ్ టీమిండియా క్రికెటర్ చరిత్రలో ఓ దిగ్గజ ఆటగాడు. భారత్ టీ-20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నాడు. మహేంద్ర సింగ్ ధోనీతో కలిసి టీమిండియాకు ఎన్నో చారిత్రాత్మక విజయాలు అందించాడు. అయితే యువరాజ్‌కు తగినంత గుర్తింపు రాకపోవడానికి ధోనీనే కారణమని యువరాజ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ తరచుగా ఆరోపిస్తుంటారు. తాజాగా ధోనీతో పాటు విరాట్ కోహ్లీ పై కూడా యోగ్‌రాజ్ సంచలన ఆరోపణలు చేశారు. 'ఒకరు ఎదుగుతుంటే వెన్నుపోటు పొడిచే వారు ఎందరో ఉంటారు. యువరాజ్ సింగ్ అంటే చాలా మంది భయపడ్డారు. తమ స్థానం ఎక్కడ లాగేసుకుంటాడో అని వారికి భయం. యువరాజ్ చాలా గొప్ప క్రికెటర్. అందుకే అతడిని చూసి స్వంత జట్టులోని వారే భయపడి వెన్నుపోటు పొడిచారు. ధోనీతో సహా చాలా మందికి యువీ అంటే భయం' అని యోగ్‌రాజ్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు' ఇక్కడ నిజమైన స్నేహాలు ఉండవు. డబ్బు, విజయం, పేరు ప్రఖ్యాతలకే విలువ ఎక్కువ. కెరీర్ ఆరంభంలో యువీ అంటే ఎంతో ఇష్టపడిన కోహ్లీ ఆ తర్వాత మారిపోయాడు. కోహ్లీ కెప్టెన్‌గా ఉన్నప్పుడు యువీకి పెద్దగా అవకాశాలు కల్పించలేదు. కోహ్లీ సపోర్ట్ చేసి ఉంటే యువీ మరింత కాలం ఆడేవాడు' అని యోగ్‌రాజ్ పేర్కొన్నారు ). అయితే గతంలోనే యువరాజ్ తన తండ్రి వ్యాఖ్యలను ఖండించాడు. ధోనీ, కోహ్లీ తనకు ఎంత సహాయం చేయాలో అంతా చేశారని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు

# ముంబైకా రాజా రోహిత్ శర్మ
# కారును చుట్టుముట్టి ఫ్యాన్స్ హంగామా




టీమిండియా దిగ్గజ ఆటగాడు, వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ తాజాగా ముంబైలోని వర్లీలో సందడి చేశాడు. గణపతి పూజల కోసం ఓ మండపానికి వెళ్లిన రోహిత్‌ను అతడి అభిమానులు చుట్టుముట్టారు. రోహిత్ కారును కదలనివ్వలేదు. దీంతో రోహిత్ కారు సన్‌రూఫ్ నుంచి బయటకు వచ్చి అభిమానులకు అభివాదం చేశాడు. దీంతో అభిమానులు.. 'ముంబైకా రాజా' అంటూ నినాదాలు చేశారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత నాలుగు నెలలుగా విశ్రాంతి తీసుకుంటున్న రోహిత్ శర్మ అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే సిరీస్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ఇటీవల బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరై పాసయ్యాడు. అంతేకాదు.. గత మూడు నెలల కాలంలో రోహిత్ శర్మ ఏకంగా 20 కిలోల బరువు తగ్గినట్టు కూడా వార్తలు వస్తున్నాయి. రోహిత్ సన్నబడిన ఫొటోలు మీడియాలో వైరల్ అవుతున్నాయి

# ఒకే ఒక్క అడుగు దూరంలో చరిత్ర సృష్టించడానికి అర్ష్‌దీప్ సింగ్ రెడీ



ఆసియా కప్ 2025 సెప్టెంబర్ 9 నుంచి యూఏఈలో ప్రారంభమవుతుంది. భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న ఆతిథ్య జట్టుతో ఆడనుంది. ఈ టోర్నమెంట్‌లో పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే అతను టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఒక ముఖ్యమైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. ఇప్పటికే 99 వికెట్లు తీసిన అర్ష్‌దీప్.. మరో ఒక వికెట్ సాధిస్తే, ఈ ఫార్మాట్‌లో 100 వికెట్లు తీసిన మొదటి భారతీయ బౌలర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. భారత టీ20ఐ వికెట్ల చార్ట్?లో..ప్రస్తుతం భారత టీ20ఐ వికెట్ల చార్ట్‌లో అర్ష్‌దీప్ సింగ్ తర్వాత యుజ్వేంద్ర చాహల్ 96 వికెట్లతో, హార్దిక్ పాండ్యా (94), జస్ప్రీత్ బుమ్రా (89) ఉన్నారు. మూడు అంకెల మార్క్‌ను చేరుకోవడం ద్వారా అర్ష్‌దీప్.. భారత బౌలింగ్ చార్ట్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకుంటాడు. ఈ లెఫ్ట్ హ్యాండ్ ఫాస్ట్ బౌలర్‌కు మరో అరుదైన రికార్డు సాధించే అవకాశం కూడా ఉంది. ఈ ఆసియా కప్‌లో అతను 100 వికెట్ల మార్క్‌ను చేరుకుంటే, ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన అత్యంత వేగవంతమైన పేసర్‌గా నిలుస్తాడు. ప్రపంచవ్యాప్తంగా రషీద్ ఖాన్ (ఆఫ్ఘనిస్థాన్), సందీప్ లమిచానే (నేపాల్), వనిందు హసరంగా (శ్రీలంక) మాత్రమే అతని కంటే ముందు ఈ ఘనత సాధించారు. అర్ష్‌దీప్ ఈ ఘనత సాధించిన నాల్గవ ఫాస్ట్ బౌలర్‌గా నిలుస్తాడు. టీమ్ ఇండియాకు కీలకమైన ఆటగాడు..అర్ష్‌దీప్ అరంగేట్రం చేసినప్పటి నుంచి, అతను ముఖ్యమైన సందర్భాలలో టీమ్ ఇండియాకు ప్రధాన బౌలర్‌గా నిలిచాడు. అతను ఆడిన 63 టీ20ఐ మ్యాచ్‌లలో 18.3 సగటుతో 99 వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ ఆరంభంలో, డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయగల అతని కెపాసిటీ అతన్ని భారత జట్టుకు చాలా ముఖ్యమైన ఆస్తిగా మార్చింది. ఈ ఆసియా కప్‌లో ముఖ్యంగా సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో జరిగే బ్లాక్‌బస్టర్ మ్యాచ్ వంటి హై-ప్రెజర్ మ్యాచ్‌లు ఉండనున్నాయి. అర్ష్‌దీప్ చరిత్ర సృష్టించి భారత క్రికెట్‌కు మరో అద్భుతమైన అధ్యాయాన్ని జోడిస్తాడేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఆసియా కప్ 2025 కోసం భారత జట్టసూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభమన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), హర్షిత్ రానా, రింకు సింగ్. స్టాండ్?బైలు: యశస్వి జైస్వాల్, ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్

# శీతల పానీయాలపై 40 శాతం జీఎస్టీ.



కూల్‌డ్రింక్స్, ఐస్డ్ టీ, ఎనర్జీ, ఇతర షుగర్ బేవరేజెస్‌పై 40 శాతం జీఎస్టీ స్వీట్లపై ట్యాక్స్‌ను 5 శాతానికి తగ్గించిన మోదీ సర్కార పన్ను నిర్ధారణలో సిత్రాలపై సర్వత్రా విమర్శలుప్రజా ప్రయోజనాల విషయంలో ప్రభుత్వాలు అస్సలు రాజీ పడకూడదు. ముఖ్యంగా ఆరోగ్యపరమైన అంశాల్లో ఎంతమాత్రం తావులేదు. అయితే ఇటీవలి జీఎస్టీ సంస్కరణల్లో మోదీ సర్కారు తీరు చూస్తుంటే ఇందుకు విరుద్ధంగానే నిర్ణయాలు జరిగినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. కూల్‌డ్రింక్స్ సహా ఇతర శీతల పానీయాలను ఆల్కహాల్, పొగాకు వంటి ఆరోగ్యానికి హానికర వస్తూత్పత్తుల జాబితాలో చేర్చి గరిష్ఠంగా 40 శాతం పన్ను విధించారు. మరోవైపు మిఠాయిలపై పన్నును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. దీంతో ఆరోగ్య రంగ నిపుణులు విస్తుపోతున్నారు. ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధతోనే పన్నుల నిర్ధారణ జరిగితే ఎందుకీ తేడాలు? అని ప్రశ్నిస్తున్నారు. ఇటీవలి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) సవరణల్లో కేంద్ర ప్రభుత్వం ఓ సందేశాన్నిచ్చింది. కూల్‌డ్రింక్స్, ఐస్డ్ టీలు, ఎనర్జీ బేవరేజెస్, ఇతర చక్కెర ఆధారిత శీతల పానీయాలు ఆరోగ్యానికి హానికరమన్నదే అది. అందుకే గరిష్ఠంగా 40 శాతం పన్ను వేసింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో షుగర్ అనేది కేవలం ఆహారం మాత్రమే కాదు.. ప్రజల ఆరోగ్యం కూడా. కాబట్టి ఈ పన్ను భారం సరైనదేనని ఒకోవచ్చు. అయితే గులాబ్ జామూన్, కాజూ కట్లీ, రసగుల్లా, హల్వా తదితర మిఠాయిలపై పన్నును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. మరి ఇదేం లెక్క అన్నదే ఇప్పుడు అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న. చక్కెర వినియోగం ఆరోగ్యానికి హానికరమే అని జీఎస్టీ కౌన్సిల్ భావించినప్పుడు. కూల్‌డ్రింక్స్‌తోపాటు మిఠా యిలపైనా గరిష్ఠ పన్నునే వేయాలి కదా అని నిపుణులు నిలదీస్తున్నారు. ప్రజారోగ్యం శీతల పానీయాల అంశంలోనే గుర్తొస్తుందా? అన్నది వారి వాదన. మరి.. మోతాదుకు మించిన చక్కెర.. పెట్ బాటిల్స్‌లో ఉన్నా, సంప్రదాయ స్వీట్ బాక్సుల్లో ఉన్నా ప్రమాదమే కదఇదీ సంగతి..భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) వివరాల ప్రకారం.. మనం రోజూ తీసుకునే క్యాలరీల్లో చక్కెర ద్వారా వచ్చేవి 5 శాతాన్ని మించకూడదు. నిజానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సూచించిన 10 శాతం కంటే ఇది తక్కువే. దేశంలో పెరుగుతున్న చక్కెర వినియోగం, తద్వారా వస్తున్న అనారోగ్య సమస్యలకు ఐసీఎంఆర్ మార్గదర్శకాలు నిదర్శనం. ఇక నగర, పట్టణ ప్రాంత ప్రజలు రోజూ 80-90 గ్రాముల చక్కెరను తింటున్నారు. అసలు మోతాదు కంటే ఇది మూడు రెట్లు ఎక్కువ. స్వీట్ల విషయానికొస్తే.. భారతీయులకు ఎంతో ప్రత్యేకం. ఇవి లేకుండా పండుగలు, శుభకార్యాలను ఊహించలేమంటే అతిశయోక్తి కాదు. అయితే కార్బొనేటెడ్ డ్రింక్స్‌తో పోల్చితే ఈ మిఠాయిల్లో వాడే చక్కెర శాతమే ఎక్కువ. ఒక్క గులాబ్ జామూన్‌లో 56 గ్రాముల పిండి పదార్థాలుంటాయి. వీటిలో చక్కెరే అధికం. అయితే 250 ఎంఎల్ కూల్‌డ్రింక్‌లో 26 గ్రాములే ఉంటాయి. దీంతో మిఠాయిలు మితిమీరి తింటే శరీరంలో ఇన్సులిన్ స్థాయిలు పెరిగి ఫ్యాటీ లివర్, ఊబకాయం, డయాబెటిస్, మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే దేశంలో 10.1 కోట్ల షుగర్ వ్యాధిగ్రస్తులున్నారు. మరో 13.6 కోట్ల మందికి షుగర్ వ్యాధి ముప్పు పొంచి ఉన్నదని లెక్కలు చెప్తున్నాయి. అంటే ప్రతీ ఐదుగురిలో దాదాపు ఒకరికి షుగర్ వ్యాధి లక్షణాలున్నాయని చెప్పవచ్చు. అయినప్పటికీ విస్మరించింది. పాశ్చాత్య సంస్కృతి పేరిట కోలాలపై పన్నును పెంచి సంప్రదాయం తగ్గించింది. మిఠాయిలపై జీఎస్టీని తగ్గించడం వెనుక మోదీ సర్కారు రాజకీయ ప్రయోజనాలున్నాయన్న వాదనలు ఇప్పుడు అంతటా గట్టిగా వినిపిస్తున్నాయి. మిఠాయి వ్యాపార సంఘాల నుంచి, ముఖ్యంగా గుజరాత్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందనే పన్ను భారాన్ని గతంతో పోల్చితే 13 శాతం దించారని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్య నిపుణులు ఈ తరహా విధానాలు సరికావని ఖండిస్తున్నారు. చక్కెర వినియోగం బాగా తగ్గాలని, లేకుంటే భవిష్యత్తు తరాలకు పెద్ద ముప్పుగా పరిణమిస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. కోలాలు, ఇతర బేవరేజెస్‌తో ఆరోగ్యానికి ఎంత ప్రమాదం ఉందో.. మిఠాయిలతో కూడా అంతేనని, ఈ విషయంలో రాజకీయాలను పక్కనబెట్టి, ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట వేయాలని కోరుతున్నారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి శ్రద్ధ ఉంటే. చక్కెర ఆధారిత పానీయాలపై 40 శాతం జీఎస్టీ మంచిదే. ఈ నిర్ణయం ఆధునిక పోకడలకు, ముఖ్యంగా యువతకు వ్యసనంగా మారిన ఆయా కూల్‌డ్రింక్స్, ఎనర్జీ బేవరేజెస్ వినియోగానికి కొంతైనా అడ్డుకట్ట వేయగలదు. అయితే మారిన జీవనశైలితో వచ్చే వ్యాధులపై కేంద్ర ప్రభుత్వానికి నిజంగా ఆందోళన, చిత్తశుద్ధే ఉంటే చేయాల్సినవి ఇవి.. అంటూ ఆరోగ్య రంగ నిపుణులు సూచిస్తున్నారు.

# 3.0: జీఎస్టీ 2.0 తర్వాత జీఎస్టీ 3.0



: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జీఎస్టీ సంస్కరణను సామాన్య ప్రజల ప్రయోజనాల కోసం తీసుకున్న పెద్ద అడుగుగా అభివర్ణించారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు దీని వల్ల ప్రయోజనం పొందుతారని ఆమె అంటున్నారు. అమెరికా సుంకంపై ఆమె తన అభిప్రాయాలను కూడా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జీఎస్టీ వ్యవస్థలో మార్పులు కనిపిస్తాయని కూడా ఆమె సూచించారు. ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని జీఎస్టీ సంస్కరణ వల్ల మొత్తం దేశం ప్రయోజనం పొందుతుందని ఆమె పేర్కొన్నారు. కొత్త జీఎస్టీ రేట్లు రైతులకు, ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం చేకూరుస్తాయని ఆర్థిక మంత్రి చెబుతున్నారు. జీఎస్టీ కౌన్సిల్ తన 58వ సమావేశంలో కొత్త రేట్ల ప్రతిపాదనను ఆమోదించిన తర్వాత సెప్టెంబర్ 22 నుండి భారతదేశం తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలను స్వీకరించడానికి సిద్ధంగా ఉంది. రెండు స్లాబ్‌ల కిందకు వచ్చే ఈ పన్ను, దాని మునుపటి వెర్షన్ కంటే తక్కువ రేట్లను కలిగి ఉందని ఆమె వివరించారు. మినహాయింపులను కూడా అందిస్తుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇండియా టుడేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో జీఎస్టీ 2.0ని సులభతరం చేయడానికి రూపొందించబడిందని అన్నారు. 3.0 అనే మరో పన్ను విధానం సంస్కరణలను మరింత బలోపేతం చేస్తుందని కూడా ఆమె వెల్లడించారు. కొత్త జీఎస్టీ పన్ను విధానం వినియోగదారులకు ప్రయోజనం చేకూరుస్తుందని, వారికి సౌలభ్యం, సౌకర్యాన్ని అందిస్తుందని నిర్మలా సీతారామన్ అన్నారు. తదుపరి దశ సంస్కరణలు జీఎస్టీ 3.0 పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేస్తుందని, జీఎస్టీ 2.0 కింద సరళతను మెరుగుపరుస్తుందని అన్నారు. ఈ జీఎస్టీ 3.0లో మార్పులు ప్రజల జీవితాలను నేరుగా ప్రభావితం చేస్తాయి. ప్రాథమిక వస్తువులపై పన్ను తగ్గుతుంది. ఉపాధి పొందే వారికి భారం తగ్గుతుంది. విద్యా సంస్థలు, పాఠశాలలకు పన్ను రాయితీలు కొనసాగుతాయి. వాణిజ్య కోచింగ్ సెంటర్లకు రాయితీలు ఉండవు. 3.0 స్థిరత్వం, ఆధారపడి ఉంటుంది. చిన్న వ్యాపారులపై గందరగోళం లేదా భారం కలిగించకుండా ప్రభుత్వం సులభంగా పన్నులను నిర్వహించడానికి ప్రయత్నిస్తుంది. జీఎస్టీ 1.0 అనేది 2017లో ప్రారంభమైంది. ఒక పన్ను అనే నినాదంతో ప్రారంభమైంది. ఇది పలు రాష్ట్రాల పన్నులను ఏకీకృతం చేసింది. జీఎస్టీ 2.0 2025లో తీసుకువచ్చింది. ఇది సెప్టెంబర్ 22 నుండి అమలులోకి రాబోతోంది. %+ూ% 2.0 కింద కొత్త పన్ను విధానం మునుపటి పన్ను విధానాన్ని సరళీకృతం చేసింది. ఇవి మునుపటి 12%, 28% రేట్లను భర్తీ చేశాయి. వీటితో పాటు లగ్జరీ, వస్తువులకు ప్రత్యేక 40% రేటును ప్రవేశపెట్టాయి. వివిధ ముఖ్యమైన వస్తువులు, సేవలపై పన్ను రేట్లు తగ్గించారు. ఇప్పటి నుండి షాంపూ, సబ్బులు, టూత్‌పేస్ట్, ఇతర రోజువారీ వినియోగ వస్తువులపై 5% పన్ను స్లాబ్ కింద పన్ను విధించనుంది కేంద్రం. వివిధ ఆహార, పాల ఉత్పత్తులపై పన్ను తొలగించింది. వెన్న, నెయ్యి, జున్ను, బ్రెడ్‌ల వంటి వాటిపై 5% పన్ను వర్తిస్తుంది. ఆరోగ్య సంరక్షణ, బీమా, స్టేషనరీ వంటి విద్య సంబంధిత వస్తువులకు మినహాయింపు ఇచ్చింది.

# భారీగా పెరిగిన బంగారం ధర.



దేశంలో బంగారం ధరలు సెప్టెంబర్ 6 శనివారం ఆల్ టైమ్ గరిష్ఠ రికార్డును చేరుకున్నాయి. 22 క్యారెట్ల బంగారం ధర పది గ్రాములకు రూ. లక్ష స్థాయికి చేరుకుంది. అదే సమయంలో 24 క్యారెట్ల బంగారం ధర పది గ్రాములకు రూ. 1.08 లక్షల దాటేసిందిమీరు ఆభరణాలు తయారు చేసుకోవాలని ప్లాన్ చేస్తుంటే, తాజా ధరలను ఒకసారి తప్పకుండా తనిఖీ చేయండి. బంగారం, వెండి ధరలు ప్రతిరోజూ హెచ్చుతగ్గులకు లోనవుతాయి. అటువంటి పరిస్థితిలో సరైన సమాచారం లేకుండా కొనుగోలు చేయడం వల్ల మీరు నష్టపోవచ్చు.మీరు ఆభరణాలు తయారు చేసుకోవాలని ప్లాన్ చేస్తుంటే, తాజా ధరలను ఒకసారి తప్పకుండా తనిఖీ చేయండి. బంగారం, వెండి ధరలు ప్రతిరోజూ హెచ్చుతగ్గులకు లోనవుతాయి. అటువంటి పరిస్థితిలో సరైన సమాచారం లేకుండా కొనుగోలు చేయడం వల్ల మీరు నష్టపోవచ్చు. ఉదయం నుంచి ఇప్పటి వరకు కొన్ని గంటల వ్యవధిలోనే తులం బంగారం ధరపై భారీగా పెరిగింది. 24 క్యారెట్ల10 గ్రాముల బంగారంపై ఏకంగా 870 రూపాయలు పెరిగి ప్రస్తుతం 1,08,490 రూపాయల వద్ద కొనసాగుతోంది. ఉదయం నుంచి ఇప్పటి వరకు కొన్ని గంటల వ్యవధిలోనే తులం బంగారం ధరపై భారీగా పెరిగింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా 870 రూపాయలు పెరిగి ప్రస్తుతం 1,08,490 రూపాయల వద్ద కొనసాగుతోంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై ఏకంగా 800 రూపాయలు పెరిగి ప్రస్తుతం 99,450 రూపాయల వద్ద ఉంది. అంటే ఇది కూడా లక్ష రూపాయలకు దగ్గరలోనే ఉంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై ఏకంగా 800 రూపాయలు పెరిగి ప్రస్తుతం 99,450 రూపాయల వద్ద ఉంది. అంటే ఇది కూడా లక్ష రూపాయలకు దగ్గరలోనే ఉంది. ఇక వెండి విషయానికొస్తే ఇది కూడా తగ్గేదేలే అన్నట్లుగా ఉంది. కిలోపై ఏకంగా 2000 రూపాయల వరకు ఎగబాకింది. ప్రస్తుతం కిలో సిల్వర్ ధర 1 లక్షా 28 వేల రూపాయల బంగారంపై ఏకంగా వద్ద ఊగిసలాడుతోంది. చెన్నై, హైదరాబాద్, కేరళ రాష్ట్రాల్లో మాత్రం కిలోకు 1 లక్షా 38 వేల వద్ద ఉంది. ఇక వెండి విషయానికొస్తే ఇది కూడా తగ్గేదేలే అన్నట్లుగా ఉంది. కిలోపై ఏకంగా 2000 రూపాయల వరకు ఎగబాకింది. ప్రస్తుతం కిలో సిల్వర్ ధర 1 లక్షా 28 వేల రూపాయల వద్ద ఊగిసలాడుతోంది. చెన్నై, హైదరాబాద్, కేరళ రాష్ట్రాల్లో మాత్రం కిలోకు 1 లక్షా 38 వేల వద్ద ఉంది.

# ప్రధానికి నాగ్ అశ్విన్ కీలక విజ్ఞప్తి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల సినిమా టికెట్లపై జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రూ.100లోపు టికెట్లపై 12% నుంచి 5%కు జీఎస్టీ తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం సినీ పరిశ్రమలో ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఒక కీలక విజ్ఞప్తి చేశారు.సోషల్ మీడియా వేదికగా స్పందించిన నాగ్ అశ్విన్, జీఎస్టీ తగ్గింపును స్వాగతించారు. అయితే ?100 ధరలోపు టికెట్లను విక్రయించే థియేటర్లు ప్రస్తుతం దేశవ్యాప్తంగా చాలా తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. అందువల్ల ?250లోపు టికెట్లకు కూడా 5% జీఎస్టీ వర్తించాలి అని ప్రధాని మోదీకి సూచించారు. “జీఎస్టీ సంస్కరణలు స్వాగతించదగినవి సార్. కానీ ఈ రోజుల్లో ?100 టికెట్లను విక్రయించే థియేటర్లు తక్కువ. పరిశ్రమ అభివృద్ధి, మధ్యతరగతి ప్రేక్షకులను ఆకర్షించడానికి ?250లోపు టికెట్లపై 5% స్లాబ్ వర్తించాలి అని నాగ్ అశ్విన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రూ.100 లోపు టికెట్లపై జీఎస్టీ తగ్గింపుతో సింగిల్ స్క్రీన్ థియేటర్లు కొంత వరకు లాభపడే అవకాశం ఉంది. కొత్త జీఎస్టీ రేట్లు 2025 సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి.



అయితే, అధిక ధరల టికెట్లు అమ్మే మల్టీప్లెక్స్ థియేటర్లు మాత్రం ఈ తగ్గింపులోకి రావడం లేదు. ?100 దాటిన టికెట్లపై ఇప్పటికీ 18% జీఎస్టీ కొనసాగుతుంది.జీఎస్టీ కౌన్సిల్ తాజాగా పాప్‌కార్న్ పై కూడ కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. సాల్టెడ్ పాప్‌కార్న్ 5% జీఎస్టీ, క్యారమెల్ (షుగర్) పాప్‌కార్న్ 18% జీఎస్టీ. ఇక్కడ ప్యాకింగ్ చేసిన చేయకపోయిన జీఎస్టీ రేటు ఒకటే వర్తించనుంది. గతంలో ప్యాకేజింగ్ ఆధారంగా వేర్వేరు రేట్లు ఉండేవి. నాగ్ అశ్విన్ లాంటి ప్రముఖ దర్శకులు చేసిన సూచనపై కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి. మధ్యతరగతి ప్రేక్షకులకు మరింత ఆర్థిక భారం లేకుండా సినిమాను ఆస్వాదించే అవకాశం కల్పిస్తే, థియేటర్ కల్చర్ తిరిగి పుంజుకుంటుందనే వ్యక్తమవుతోంది.

# విమాన ప్రయాణాల వల్ల అలసట.



నేషనల్ క్రష్‌గా దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న రష్మిక మందన్న, తాజాగా తన వృత్తిపరమైన జీవితంలో ఎదురవుతున్న ఓ సమస్యను అభిమానులతో పంచుకున్నారు. తెల్లవారుజామున చేసే విమాన ప్రయాణాలు తనకు ఎంతటి కష్టం కలిగిస్తున్నాయో ఆమె ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొన్నారు. ఉదయం 3:50 గంటలకు విమానంలో కిటికీ ద్వారా తీసిన ఓ ఫొటోను షేర్ చేసిన రష్మిక, “ఉదయం 3:50 ఫ్లైట్లు చాలా దారుణం. ఇది రాత్రా? పగలా? అర్థం కావడం లేదు,” అంటూ కామెంట్ చేశారు. అలాంటి టైమింగ్స్‌కి ప్రయాణాలు చేయడం తాను చాలా బాధగా అనుభవిస్తున్నట్లు తెలిపారు.“రెండు గంటలు నిద్రపోయి లేచి పని చేయాలా? అలా చేస్తే రోజంతా నీరసం. లేక నిద్రపోకుండా పని చేసి తర్వాత నిద్రపోవాలా? అలా చేసిన అదే పరిస్థితి. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం నిజంగా కష్టంగా మారుతోంది.” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె గమ్యం గురించి ఎలాంటి సమాచారం ఇవ్వనప్పటికీ, రష్మిక బిజీ షెడ్యూల్ వల్ల నిత్యం ఇలా ప్రయాణాలు చేయాల్సి వస్తోందని అర్థమవుతోంది. వృత్తిపరంగా రష్మిక ప్రస్తుతం బిజీగా ఉంది. బాలీవుడ్ లో ఆయుష్మాన్ ఖురానా సరసన ‘థమా’ అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో పరేష్ రావల్, నవాజుద్దీన్ సిద్ధిఖీ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వాంపైర్ల మిస్టరీతో కూడిన థ్రిల్లింగ్ కథగా ఈ చిత్రం రూపొందనుంది.‘ముంజ్యా’ ఫేమ్ ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో ఈ మూవీ రూపొందుతుంది. దీపావళి 2025 కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.తెలుగులో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న ‘ది గర్ల్‌ఫ్రెండ్’ చిత్రంలో నటిస్తున్నారు.ఇది రష్మికకు చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అని ఆమె స్పష్టం చేశారు. 2 పిక్చర్స్, మాస్ మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గత డిసెంబర్‌లో విడుదలైన టీజర్‌కి మంచి స్పందన లభించింది. తాజాగా రష్మికకి సైమా అవార్డ్ దక్కిన విషయం తెలిసిందే. ఉత్తమ నటిగా అవార్డ్ దక్కించుకుంది.

# సంక్రాంతికి వస్తున్నాం’ రేంజ్ హిట్ కొట్టింది

లిటిల్ హార్ట్స్’ సినిమా వైల్డ్ ఫైర్‌లా వెళ్తోందని నిర్మాత బన్నీ వాస్అన్నారు. ఈ చిత్రానికి అనూహ్యమైన వసూళ్లు రావడం ఖాయమని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఇలాంటి చిత్రాల ద్వారానే నిర్మాతలకు గౌరవం పెరుగుతుందన్నారు బన్నీ వాస్. మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా సాయి మార్తాండ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘లిటిల్ హార్ట్స్’. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. వంశీ నందిపాటి, బన్నీ వాసు గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈ నెల 5న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం సక్సెస్‌ఫుల్‌గా ఆడుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ ‘లిటిల్ హార్ట్స్’ సినిమా అన్నివర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతూ, సూపర్ హిట్ కావడంతో మూవీ టీమ్ సక్సెస్ మీట్ నిర్వహించారు. బన్నీవాస్ మాట్లాడుతూ ‘లిటిల్ హార్ట్స్’ లాంటి చిన్న సినిమాకు ప్రేక్షకుల ఆదరణ ఎలా ఉంటుందో అన్న సందేహంతోనే 3 షోస్‌తో ప్రీమియర్స్ చేశాం. సాయంత్రానికి 29 షోస్ పడ్డాయి. ఈ షోస్ అన్నీ దాదాపు 90 పర్సెంట్ ఫిల్ అయ్యాయి. ఇప్పుడు మల్టీప్లెక్స్‌లో ఒక్క టికెట్ కూడా లేదు. శనివారం బుకింగ్ అయ్యాయి. ఒక చిన్న చిత్రానికి ప్రేక్షకులు అసాధారణ విజయాన్ని అందించడం గొప్ప విషయం. సినిమా మీద పెట్టుకున్న నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. ఒక మంచి సినిమా అందిస్తే అది చిన్నదా పెద్దదా అని చూడకుండా సక్సెస్ నిరూపించారు. ఈ రోజు ప్రేక్షకులు కేవలం సూపర్ హిట్ చిత్రాలకే వెళ్తున్నారు. లిటిల్




హార్ట్స్‌కు పెరుగుతున్న ఆదరణ చూస్తే చిన్న సినిమాల్లో పెద్ద విజయం సాధించిన సినిమాగా అనిపిస్తుంది. దాదాపు 50 రోజుల వరకు ఓటీటీలోకి తీసుకురావొద్దని కోరుతున్నా. ఈటీవీ నుంచి ‘నువ్వే కావాలి’ లాంటి బ్లాక్ బస్టర్స్ వచ్చాయి. ‘లిటిల్ హార్ట్స్’ వైల్డ్ ఫైర్‌లా వెళ్తోంది. అనూహ్యమైన వసూళ్లు ఈ సినిమాకు వస్తాయి. ఇలాంటి చిత్రాల ద్వారానే మాకు గౌరవం పెరుగుతుంది. ‘ప్రేమలు’ వంటి సినిమాల చూశాక మన తె?నిగులో అలాంటి మూవీస్ అంద్టిస్త తప్పకుండా ఆదరిస?రని అనిపించేది. “లిటిల్ హార్ట్స్” తో అది నిజమైంది. ఈ సినిమాను మాకు ఇచ్చిన ఆదిత్య హాసన్‌కు, ఈటీవీ విన్‌కు థ్యాంక్స్. కాలేజ్ స్టూడెంట్స్ మీ ఫ్రెండ్స్‌తో, ఫ్యామిలీతో వెళ్లి చూడండి.. బాగా ఎంజాయ్ చేస్తారు’ అని అన్నారు.వంశీ నందిపాటి మాట్లాడుతూ ‘మంచి కంటెంట్‌తో వస్తే ఊహించనంత కలెక్షన్స్ ఇస్తామని ప్రేక్షకులు మరోసారి నిరూపించారు. సాయి మార్తాండ్ ఒక ఆంథెటిక్, ఆర్గానిక్ ఎంటర్‌టైన్‌మెంట్ తీశాడు. మౌళి అందరినీ ఆకట్టుకున్నాడు. ఒక కొత్త స్టార్‌గా తనను తాను మలుచుకోబోతున్నాడు అనిపిస్తోంది. శివానీ కూడా బాగా నటించింది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం తర్వాత అంతగా ‘లిటిల్ హార్ట్స్’ చూసి నవ్వుకున్నాం, ఆ సినిమా స్థాయి విజయం వస్తుందంటూ సోషల్ మీడియాలో అప్రిషియేషన్స్ వస్తున్నాయి’ అన్నారు.

# డార్లింగ్ అభిమానులకు మాస్ అప్డేట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం ‘స్పిరిట్’ ఇంకా సెట్స్‌పైకి వెళ్లకముందే భారీ స్థాయిలో హైప్‌ను క్రియేట్ చేస్తోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై సందీప్ రెడ్డి స్వయంగా ఒక షాకింగ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఓ టీవీ కార్యక్రమంలో పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ మూవీ షూటింగ్ త్వరలో మొదలవుతుంది. ఇప్పటికే బీజీఎం పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. యానిమల్ టైంలో మాదిరిగానే ముందుగా మ్యూజిక్ వర్క్ పూర్తిచేస్తే, సీన్ అవుట్‌పుట్ ఎలా వస్తుందో ముందే అర్థమవుతుంది. ఇది టైమ్, ప్రొడక్షన్ బడ్జెట్ రెండింటినీ ఆదా చేస్తుంది అని అన్నారు.ఇక ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. ప్రభాస్ చాలా నిజాయితీగలవాడు, కోపం లేకుండా పని చేసే వ్యక్తి. స్టార్ అన్న అహంకారం ఆయనలో ఏమాత్రం లేదు. నేను ఊహించిన దానికన్నా ఎక్కువగా ఆయన ఈ సినిమాకు సహకరిస్తున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వస్తాం అని అన్నారు.



# ‘ఘాటి’ రివ్యూ: అనుష్క ఘాటైన పోరాటం ఫలించిందా

అరుంధతి, సరోజా, దేవసేన, రుద్రమదేవి, భాగమతి.. ఇవన్నీ అనుష్క కెరీర్‌లో మైలురాయి లాంటి పాత్రలు. వేదం సినిమాలో సరోజా లాంటి ఐకానిక్ పాత్రని ఇచ్చిన క్రిష్‌తో స్వీటీ మరోసారి చేతులు కలిపి ‘ఘాటి’ తో ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఘాటీలో శీలావతి తన కెరీర్‌లో మరో మైలురాయిలాంటి పాత్ర అవుతుందని నమ్మకంగా చెప్పింది స్వీటీ. మరి ఆ నమ్మకం నిజమైయిందా? వేదం మ్యాజిక్ రిపీట్ అయ్యిందా? ఇంతకీ ఈ ఘాటి కథేమిటి? ఇదంతా రివ్యూల్లో చూద్దాం.కథ: ఆంధ్ర-ఒడిశా బోర్డర్స్. అక్కడి తూర్పు కనుమల్లో కుందుల నాయుడు (చైతన్య రావు), కాష్టాల నాయుడు (రవీంద్ర విజయ్) గంజాయి మాఫియా సాగిస్తుంటారు. ఘాటీలుగా పిలవబడే స్థానిక ప్రజలు ఈ ఇద్దరి గుప్పెట్లో ఉంటూ గంజాయి రవాణా చేస్తుంటారు. అదే ప్రాంతంలో వుండే శీలావతి (అనుష్క), దేశీ రాజు (విక్రమ్ ప్రభు) ఆ పనికాకుండా వేరే పనులు చేసుకుంటూ జీవితాన్ని గడుపుతుంటారు. కానీ అనుకోని పరిస్థితులు వలన తిరిగి మళ్లీ గంజాయి స్మగ్లింగ్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. వారు ఎందుకు మళ్ళీ స్మగ్లింగ్ చేయాల్సి వచ్చింది? ఈ క్రమంలో ఎలాంటి పోరాటం చేశారనేది మిగతా కథ.విశ్లేషణ: దర్శకుడు క్రిష్ ఎంచుకున్న సెటప్ బలంగా ఉంది. ఘాటి కమ్యూనిటీ నేపథ్యం కొత్తదనాన్ని తెస్తుంది. గంజా మాఫియా, స్థానిక ఘాటీల చుట్టూ తిరిగే ఫస్ట్ నెమ్మదిగా సాగినప్పటికీ కథలో తీవ్రతని పెంచగలిగింది. ఆంధ్ర %-% ఒడిశా ఈస్టర్న్ ఘాట్స్ నేపథ్యంలో కథ నడవడం ఫ్రెష్‌నెస్ తీసుకొచ్చింది. మంచి ఇంటర్వెల్ బ్లాక్ కుదిరింది.సెకండ్ హాఫ్ దేశీ రాజు,శీలావతి బ్యాక్‌స్టోరీలో ఎమోషన్ వర్క్ అవుట్ అయ్యింది. ఆ తర్వాత కథ రివెంజ్ డ్రామాగా మారిన తీరు ఆకట్టుకుంటుంది. ఈ రివెంజ్ ట్రాక్ ఆడియన్స్ ఎంగేజ్ చేయగలిగింది. క్రిష్ రాసిన కొన్ని సీన్లు ఇంపాక్ట్ కలిగించాయి. అయితే సినిమా క్లైమాక్స్ కి చేరుకునే కొద్ది ట్రీట్మెంట్ రొటీన్ గా మారిపోతుంది. స్క్రీన్ ప్లే ఊహకు అందిపోయేలా సాగుతుంది. క్రిష్ బలం బలమైన ఎమోషన్స్ ని పలికించడం. కానీ




ఇందులో పాత్రల్లో వుండే ఎమోషన్స్ అంతగా పైకి రాలేదు. కాకపోతే గంజాయి వలన కలిగే పర్యవసానాలు చూపించిన తీరు సందేశాత్మకంగా వుంటుంది. అనుష్క స్ట్రాంగ్ స్క్రీన్ ప్రజెన్స్ ఆమె అభిమానులకు నచ్చుతుంది.నటీనటులు నటన: శీలావతి పాత్రలో అనుష్క ఒదిగిపోయింది. ఎమోషనల్ సీన్స్‌లో మెప్పించిన స్వీటీ యాక్షన్ సన్నివేశాల్లో అదేస్థాయిలో అదరగొట్టింది. క్రిష్ శీలావతి పాత్రకి ఇచ్చిన ఎలివేషన్స్ బావున్నాయి. శీలావతి పాత్ర అనుష్క అభిమానులకు గుర్తిండిపోతుంది. ఈ స్థాయిలో యాక్షన్ చేయడం స్వీటీకి ఇదే ఫస్ట్ టైం. దేశిరాజు పాత్రలో విక్రమ్ ప్రభు డీసెంట్‌గా చేశాడు. ఫస్ట్ హాఫ్ తన చుట్టూనే తిరుగుతుంది. ఈ రెండు కూడా హై ఇంటెన్స్ వున్న పాత్రలే. కుందులు నాయుడు పాత్రలో చైతన్యరావు కొత్త విలనిజం పంచాడు. నిజానికి ఇలాంటి పాత్రలో చైతన్య కనిపించడం ఫ్రెష్‌నెస్ తీసుకొచ్చింది. జగపతిబాబు తినే మ్యానరిజం అంతగా కుదరలేదు. రవీందర్ విజయ్ తో పాటు మిగతా పాత్రలు కూడా కథకు తగ్గట్టుగానే ఉన్నాయి.టెక్నికల్‌గా: మనోజ్ కెమరావర్క్ సినిమాకి ప్లస్ అయ్యింది. తూర్పు కనుమల్లో చిత్రీకరించిన సన్నివేశాలు ఓ కొత్త అనుభూతిని పంచాయి. నేచర్‌ని తన కెమరా చక్కగా ఒడిసిపట్టుకుంది. సాగర్ పాటలు గుర్తుండవు కానీ నేపథ్య సంగీతం మాత్రం ఇంటెన్స్‌గా చేశారు. యాక్షన్ సీన్స్‌లో తన బీజీఎం హైలైట్ అయ్యింది. సాయి మాధవ్ బుర్రా రాసిన మాటలు కొన్ని ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉన్నాయి. ఫస్ట్ ఫ్రేం, యువీ క్రియేషన్స్ నిర్మాణ విలువలు ఉన్నతంగా వున్నాయి.ప్లస్ పాయింట్స్‌అనుష్క స్క్రీన్ ప్రజెన్స్లిటీ బ్యాక్ డ్రాప్, యాక్షన్ సీన్స్‌నిర్మాణ విలువలుమైనస్ పాయింట్స్ తగ్గిన భావోద్వేగాలుఊహకు అందే కథనం

# మూడేళ్లుగా టాలీవుడ్ లో టాప్ లేపిన శ్రీలీల

మూడేళ్ళ కింద ధమాకాతో మొదలైన శ్రీలీల మ్యాజిక్ కంటిన్యూ అవుతూనే ఉంది.. ఎంతమంది హీరోయిన్లు వచ్చినా ఈమె మాత్రం వరసగా హీరోలందర్నీ కవర్ చేసారు.ఇప్పుడు కూడా రవితేజతో మాస్ జాతర.. పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల్లో నటిస్తున్నారు. కాకపోతే వీటి తర్వాత కొన్నాళ్లుగా తెలుగు సినిమాలకు సైన్ చేయట్లేదు ఈ వైరల్ వయ్యారి.ఇప్పుడు కూడా రవితేజతో మాస్ జాతర.. పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల్లో నటిస్తున్నారు. కాకపోతే వీటి తర్వాత కొన్నాళ్లుగా తెలుగు సినిమాలకు సైన్ చేయట్లేదు ఈ వైరల్ వయ్యారి.అనుకోకుండా కాదు.. కావాలనే తెలుగు సినిమాలకు గ్యాప్ ఇస్తున్నారు శ్రీలీల. ముఖ్యంగా తెలుగులో తనకు నచ్చే కథలు రావట్లేదని చెప్తున్నారు ఈ బ్యూటీ. ఇన్నాళ్లూ అయిందేదో అయిపోయింది.. ఇకపై తనకు నచ్చే కథలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు ఈ బ్యూటీ. అనుకోకుండా కాదు.. కావాలనే తెలుగు సినిమాలకు గ్యాప్ ఇస్తున్నారు శ్రీలీల. ముఖ్యంగా తెలుగులో తనకు నచ్చే కథలు రావట్లేదని చెప్తున్నారు ఈ బ్యూటీ. ఇన్నాళ్లూ అయిందేదో అయిపోయింది.. ఇకపై తనకు నచ్చే కథలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు ఈ బ్యూటీ.ఈ విషయంలో బాలీవుడ్ మేకర్స్ తన స్వభావానికి తగ్గ పాత్రలు రాస్తున్నారని చెప్పారు శ్రీలీల.ఖాళీ లేక కాదు.. కథలు నచ్చకే కింగ్డమ్, లెనిన్ నుంచి నుంచి తప్పుకున్నారని శ్రీలీల కామెంట్స్ చూస్తే అర్థమవుతుంది. ఈ విషయంలో బాలీవుడ్ మేకర్స్ తన స్వభావానికి తగ్గ పాత్రలు రాస్తున్నారని చెప్పారు శ్రీలీల.ఖాళీ లేక కాదు.. కథలు నచ్చకే కింగ్డమ్, లెనిన్ నుంచి నుంచి తప్పుకున్నారని శ్రీలీల కామెంట్స్ చూస్తే అర్థమవుతుంది.ప్రస్తుతం హిందీలో కార్తిక్ ఆర్యన్ సినిమాతో పాటు తమిళంలో శివకార్తికేయన్‌తో పరాశక్తిలో నటిస్తున్నారు శ్రీలీల. ఈ లెక్కన నచ్చే కథ వస్తే గానీ తెలుగులో శ్రీలీలను చూడలేరేమో అభిమానులు..? కాకపోతే ఆ లోపే మాస్ జాతరతో ఓసారి పలకరించనున్నారు ఈ బ్యూటీ.ప్రస్తుతం హిందీలో కార్తిక్ ఆర్యన్ సినిమాతో పాటు తమిళంలో శివకార్తికేయన్‌తో పరాశక్తిలో నటిస్తున్నారు శ్రీలీల. ఈ లెక్కన నచ్చే కథ వస్తే గానీ తెలుగులో శ్రీలీలను చూడలేరేమో అభిమానులు..? కాకపోతే ఆ లోపే మాస్ జాతరతో ఓసారి పలకరించనున్నారు ఈ బ్యూటీ.



# బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9 గ్రాండ్ లాంచ్

తెలుగు ప్రేక్షకుల్లో అత్యంత ప్రజాదరణ పొందిన రియాలిటీ షో ‘బిగ్‌బాస్’ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సారి సీజన్ 9 సరికొత్తగా ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అవుతోంది. సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం రాత్రి 7 గంటలకు బిగ్‌బాస్ 9 గ్రాండ్ ప్రీమియర్ జరగనుండగా, ఈ సీజన్‌కి కూడా కింగ్ నాగార్జునే హోస్ట్‌గా వ్యవహరించనున్నా రు. ఇప్పటివరకు బిగ్‌బాస్‌లో ఎక్కువగా సెలబ్రిటీలు మాత్రమే హౌజ్‌లోకి అడుగుపెట్టి సందడి చేశారు. కానీ ఈసారి ప్రేక్షకులకి మరింత ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు షో టీమ్ ఒక వినూత్న ప్రయోగానికి తెరలేపింది. “కామనర్స్ వర్సెస్ సెలబ్రిటీస్” కాన్సెప్ట్‌తో సీజన్ 9 ముందుకు రానుంది.ఈసారి మొత్తం 15 మంది హౌజ్‌మేట్లు బిగ్‌బాస్ హౌజ్‌లోకి




అడుగుపెట్టనున్నారు. వీరిలో 9 మంది సెలబ్రిటీలు కాగా, మిగిలిన 6 మంది సామాన్య ప్రజలే. కామనర్స్‌ను ఎన్నుకోవడానికి షో నిర్వాహకులు అగ్నిపరీక్ష పేరుతో పలు టాస్క్‌లు నిర్వహించిన విషయం తెలిసిందే . ఓటింగ్ చివరికి ఆరుగురిని ఎంపిక చేశారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794